# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...

epaper.hyderabadpulsenews.in



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాడ్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020

- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 152 | పేజీలు : 08 | బుధవారం | 10-06-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


### మేము 18 గంటలు కష్టపడుతుంటే...
## హరీష్ రావు అబద్ధాలు చెబుతున్నారు

- రాష్ట్ర కేబినెట్ రోజుకు 18 గంటలు ప్రజల కోసం పనిచేస్తోందన్న భట్టి
- బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దివాలా తీయించిందని మండిపాటు
- తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 76 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని వెల్లడి



హైదరాబాద్ పల్స్,వరంగల్

తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బీఆర్ఎస్ నాయకులపై, ముఖ్యంగా మాజీ మంత్రి హరీష్ రావుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వరంగల్ జిల్లా చిల్పూర్ మండలం పల్లగుట్ట

2

### ఉద్యోగుల జీతాల చెల్లింపులో
## జాప్యం వద్దు..

అధికారులకు సీఎం వార్నింగ్

2



### 147 లక్షల మెట్రిక్ టన్నుల
## ధాన్యం సేకరించాం

- రికార్డ్ స్థాయిలో 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్న ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేశామని ప్రకటన
- పక్క రాష్ట్రాలు మా కన్నా తక్కువ కొన్నాయని వెల్లడి

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

రాష్ట్రంలో 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇన్ని టన్నుల ధాన్యం సేకరణ దేశంలోనే రికార్డు అని తెలిపారు. రూ.35,077 వేల కోట్లు రైతుల

2

### రేవంత్ రెడ్డికి ప్రాజెక్టులు
## ఏటీఎంలుగా మారాయి

- ధాన్యం కొనుగోలు వ్యవహారంలో ప్రభుత్వంపై రాంచందర్ రావు విమర్శలు
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్రం నిర్వహించదని వ్యాఖ్య
- కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపాటు



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

తెలంగాణలో ధాన్యం కొనుగోలు వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. భువనగిరి మీడియా సమావేశంలో

2

### మూడువేల బస్సులకు
# ఓనర్లను చేస్తం

- మహిళా రిజర్వేషన్ల కల్పనలో కాంగ్రెస్ కీలకం
- కాంగ్రెస్ తోనే మహిళలకు రాజకీయ చైతన్యం
- గత ప్రభుత్వాలు మహిళలపై చిన్నచూపు
- మహిళా సంఘాలకు రూ.11,220 కోట్ల చెక్కుల పంపిణీ
- 553 బస్సులను జెండా ఊపి ప్రారంభించిన సీఎం



హైదరాబాద్ పల్స్, హైదరాబాద్

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కోసం 2013లో సోనియా గాంధీ పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టారని ...రాబోయే రోజుల్లో 33 శాతం మహిళలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల్లో కీలక పాత్ర పోషించబోతున్నారని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.మహిళా శక్తిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. మండల మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో నిర్వహించనున్న 553 బస్సులను ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మహిళా సాధికారతపై పలు వ్యాఖ్యలు చేశారు. మహిళలను లక్ష్మీదేవితో సమానంగా మన సంస్కృతి గౌరవిస్తుందని పేర్కొన్నారు. భూమిని భూమాతగా, దేశాన్ని భారతమాతగా, రాష్ట్రాన్ని తెలంగాణ తల్లిగా భావించే సంప్రదాయం మనదని అన్నారు. మహిళలకు ఓటు హక్కు కల్పించి రాజకీయ హక్కులు ఇచ్చిన ఘనత నెహ్రూదేనని ఆయన గుర్తుచేశారు.రాష్ట్రపతిగా, మంత్రులుగా మహిళలకు అవకాశాలు ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ అని చెప్పారు. గత ప్రభుత్వం మొదటి ఐదేళ్లలో ఒక్క మహిళకైనా మంత్రి పదవి ఇవ్వలేదని, కేంద్రంలో

2

## "దీదీ మారిపోయారు"..

తృణమూల్ రెబెల్ ఎంపీ శతాబ్ది రాయ్ సంచలన వ్యాఖ్యలు!

- ఎందుకు తిరుగుబాటు చేయాల్సి వచ్చిందో వివరించిన శతాబ్ది రాయ్
- అధినాయకత్వాన్ని కలిసే అవకాశం ఉండేది కాదని ఆరోపణ
- పార్టీలో అవినీతి పెరిగినట్లు వెల్లడి ఎంపీల గొంతు నొక్కారని విమర్శ
- ప్రజల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నామని సమర్థన



హైదరాబాద్ పల్స్,పశ్చిమ బెంగాల్

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ (దీదీ) నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీలో రేగిన తిరుగుబాటు జ్వాలలు ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. పార్టీకి చెందిన 20 మంది లోక్‌సభ ఎంపీలు అధికార ఎన్డీయే కూటమికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. ఈ తిరుగుబాటు గ్రూప్‌నకు

2

## విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదం..

ఆర్థిక సాయం వివరాలు ప్రకటించిన పవన్ కల్యాణ్

- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాద స్థలాన్ని పవన్ పరిశీలన కిమ్స్ ఆసుపత్రిలో
- క్షతగాత్రులను పరామర్శించిన డిప్యూటీ సీఎం
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని హామీ
- నిపుణుల కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు
- త్వరలో కార్మికుల సమస్యలపై సమావేశం నిర్వహిస్తానని వెల్లడి



హైదరాబాద్ పల్స్,విశాఖపట్నం

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖకు చేరుకున్న ఆయన కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న

2



## అంగన్‌వాడీల జీతాలు చెల్లించాలి

సీఎం రేవంత్ రెడ్డిపై ఎమ్మెల్యే హరీశ్ రావు ఫైర్..

2

## పీఓకేలో రక్తపాతం..

*పాక్‌పై అంతర్జాతీయ సమాజం చర్యలు తీసుకోవాలి*

- పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో చెలరేగిన హింస.. 30 మంది మృతి
- చౌకగా పిండి, విద్యుత్ కోరుతూ ప్రజల ఆందోళనలు
- ఘటనను తీవ్రంగా ఖండించిన భారత్
- పాక్‌ను అంతర్జాతీయ సమాజం నిలదీయాలని పిలుపు
- ప్రజలపై పాక్ బలగాల ఊచకోత అని ఆరోపణలు



హైదరాబాద్ పల్స్,కశ్మీర్

పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లోని రావల్‌కోట్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘర్షణల్లో పౌరులు మరణించడంపై భారత్ తీవ్రంగా స్పందించింది. నిరసనకారులపై పాకిస్థాన్ సాగించిన అణచివేత చర్యలకు గానూ, ఆ దేశాన్ని

2

### దమ్ముంటే బహిరంగ
## చర్చకు రావాలి

రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్

- అభద్రతా భావంతో రేవంత్ వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారన్న కిషన్ రెడ్డి
- రాష్ట్ర అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై చర్చకు రావాలని సవాల్
- ఒక్క ప్రాజెక్టును అడ్డుకున్నట్లు నిరూపించినా రాజీనామా చేస్తానన్న కిషన్ రెడ్డి



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీల వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనపై, కేంద్ర ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన... అహంకారం, అభద్రతా భావం, తీవ్ర నిరాశతోనే రేవంత్ రెడ్డి వ్యక్తిగత విమర్శలకు, తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని ధ్వజమెత్తారు."కేంద్రంలో

2

### విస్తరిస్తున్న
## రుతుపవనాలు



- తెలంగాణలో విస్తరిస్తున్న రుతుపవనాలు పలు జిల్లాలో భారీవర్ష సూచన
- తెలంగాణలోని విస్తరిస్తున్న రుతుపవనాలు ఇవాళ భారీ వర్షాలు కురిసే అవకాశం
- గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్ష సూచన

హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

నైరుతి రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రంలో విస్తరిస్తున్నాయి. తెలంగాణ దక్షిణ సరిహద్దు జిల్లా జోగులాంబ గద్వాలను తాకాయి. రేపటి లోగా తెలంగాణ అంతట రుతుపవనాలు

2

# రేవంత్ రెడ్డికి ప్రాజెక్టులు ఏటీఎంలుగా మారాయి

**మొదటి పేజీ రువాయి**

మాట్లాడిన ఆయన.. ధాన్యం దిగుబడుల అంచనాలను రూపొందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, కేంద్రానికి సరైన ఇండెంట్ పంపలేకపోయిందని ఆరోపించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేంద్రం నిర్వహించదని, రాష్ట్రాలు కొనుగోలు చేసిన ధాన్యానికి కేంద్రమే రీయింబర్స్‌మెంట్ అందిస్తుందని స్పష్టం చేశారు. దేశవ్యాప్త సేకరణలో దాదాపు 50 శాతం తెలంగాణ నుంచే జరిగినప్పటికీ.. కేంద్రంపై తప్పుడు ప్రచారం చేస్తూ రైతులను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు.రైతుల సమస్యలను పక్కనబెట్టి, వాస్తవాలను దాచిపెడుతూ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. ఇదే క్రమంలో పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, మూసి ప్రక్షాళన ప్రాజెక్టులు సీఎం రేవంత్ రెడ్డికి 'ఏటీఎం'లుగా మారాయని రాంచందర్ రావు సంచలన ఆరోపణలు చేశారు. తాము మూసి ప్రక్షాళనకు వ్యతిరేకం కాదని, కేవలం 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుకే తమ అభ్యంతరమని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేసే వరకు బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని, అలాగే కాళేశ్వరం అవినీతి అంశంలో కేసీఆర్‌ను కాపాడేందుకే ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆయన ఆరోపించారు.

### మేము 18 గంటలు కష్టపడుతుంటే..

# హరీష్ రావు అబద్ధాలు చెబుతున్నారు

**మొదటి పేజీ రువాయి**

గ్రామంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తుంటే... హరీష్ రావు మాత్రం అబద్ధాలు ప్రచారం చేయడంలో బిజీగా ఉన్నారని మండిపడ్డారు. "రాష్ట్ర క్యాబినెట్ రోజుకు 18 గంటలు ప్రజల కోసం పనిచేస్తుంటే.. హరీష్ రావు నిత్యం అబద్ధాలు చెబుతున్నారు" అని భట్టి విమర్శించారు.పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని దోచుకుని, దివాలా తీయించిందని ఆయన ఆరోపించారు. మరి నాడు అధికారంలో ఉన్నప్పుడు పేదలకు సన్నబియ్యం ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వ విజయాలను ఆయన పంచుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే 76,000 ప్రభుత్వ ఉద్యోగాలు అందించిందని, రైతులకు అండగా నిలుస్తూ తడిసిన, దెబ్బతిన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తోందని తెలిపారు. అలాగే రుణమాఫీ పథకాన్ని నిలకడగా అమలు చేస్తున్నామని చెప్పారు.బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యానికి గురైన దేవాదుల ప్రాజెక్టును తాము వేగవంతం చేశామన్నారు. గత ప్రభుత్వం డిస్కమ్‌లకు బకాయిలు పెట్టడం వల్లే విద్యుత్ సమస్యలు వచ్చాయని, తాము ఆ బకాయిలను చెల్లిస్తూ విద్యుత్ సరఫరాను మెరుగుపరిచామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో నెరవేరుస్తున్నామని చెప్పారు. రఘునాథపల్లిలో 230 కేవీ సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు.

# పీఓకేలో రక్తపాతం..

**మొదటి పేజీ రువాయి**

అంతర్జాతీయ సమాజం జవాబుదారీని చేయాలని ఆశిస్తున్నట్లు భారత్ మంగళవారం పేర్కొంది.జూన్ 7, 8 తేదీల్లో రావల్‌కోట్‌లో భద్రతా బలగాలకు, జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) మద్దతుదారులకు మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణలు జరిగాయి. ఈ హింసాకాండలో ఆరుగురు నిరసనకారులు, నలుగురు పోలీసులు, ఒక సామాన్య పౌరుడితో సహా 30 మంది మరణించగా, 200 మందికి పైగా గాయపడ్డారు.

**అసలేం జరిగింది?**

సరసమైన ధరలకు గోధుమ పిండి, విద్యుత్ సరఫరా చేయాలని, రాజకీయ హక్కులు కల్పించడంతో పాటు తమ ప్రాంతంపై చూపుతున్న వివక్షను అంతం చేయాలని డిమాండ్ చేస్తూ జేఏఏసీ అనే పౌర సమాజ కూటమి ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలోనే నిరసనలు ఉద్రిక్తంగా మారి హింసకు దారితీశాయి. నిరసనకారులే ముందుగా కాల్పులు జరిపారని, అందుకే తాము ఆత్మరక్షణ కోసం స్పందించాల్సి వచ్చిందని పాకిస్థాన్ అధికారులు చెబుతున్నారు. అయితే, భద్రతా బలగాలే తమపై విచక్షణారహితంగా కాల్పులు జరిపి ఊచకోతకు పాల్పడ్డాయని జేఏఏసీ నేతలు ఆరోపిస్తున్నారు.సోషల్ మీడియాలో మృతుల సంఖ్య 150 నుంచి 200 వరకు ఉండవచ్చని వదంతులు వ్యాపిస్తున్నప్పటికీ, ప్రభుత్వం కమ్యూనికేషన్ వ్యవస్థలపై ఆంక్షలు విధించడంతో వాస్తవాలను ధృవీకరించడం కష్టంగా మారింది. ఈ ఘటనపై బ్రిటన్‌లోని ప్రవాస కశ్మీరీలు పాకిస్థాన్ కాన్సులేట్ వద్ద నిరసనలు చేపట్టారు. ప్రస్తుతం పీఓకేలో బంద్ కొనసాగుతుండగా, ముజఫరాబాద్, భీంబర్, మీర్‌పూర్ వంటి ప్రాంతాల్లో పరిస్థితులు ఇంకా ఉద్రిక్తంగానే ఉన్నాయి

# అంగన్‌వాడీల జీతాలు చెల్లించాలి

**మొదటి పేజీ రువాయి**

హైదరాబాద్: అంగన్‌వాడీలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జీతాలు చెల్లించడం లేదంటూ బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని రేవంత్ మభ్యపెడుతున్నారని ఆగ్రహించారు. అంగన్‌వాడీలకు ముందు జీతాలు చెల్లించి మహిళలపై ముఖ్యమంత్రికి ఉన్న గౌరవాన్ని నిరూపించుకోవాలన్నారు. రెండు నెలలుగా జీతాలు అందక 62 వేల మంది అంగన్‌వాడీలు కష్టాలు పడుతున్నారని మాజీ మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు.

# "దీదీ మారిపోయారు"..

**మొదటి పేజీ రువాయి**

డిప్యూటీ లీడర్‌గా ఎన్నికైన ప్రముఖ బెంగాలీ నటి, నాలుగు సార్లు ఎంపీగా గెలిచిన శతాబ్ది రాయ్ ఈ సంక్షోభంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. 2009 నుంచి మమతా బెనర్జీకి అత్యంత నమ్మకస్థురాలిగా ఉన్న ఆమె.. తాము పార్టీని వీడటానికి గల అసలు కారణాలను 'ఎన్‌డీటీవీ' ఇంటర్వ్యూలో వెల్లడించారు."గత కొన్నేళ్లుగా దీదీ చాలా మారిపోయారు" అని శతాబ్ది రాయ్ వ్యాఖ్యానించారు. మమతా బెనర్జీతో తనకు ఇప్పటికీ బలమైన బంధం ఉందని, అయితే అంతకంటే ప్రజా పనులే ముఖ్యమని ఆమె స్పష్టం చేశారు. పార్టీలో అంతర్గతంగా పెరిగిపోయిన అవినీతి, నాయకత్వానికి-ప్రజాప్రతినిధులకు మధ్య పెరిగిన దూరం వల్లే తాము ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు.పార్టీలో కేవలం కొంతమంది ఎంపిక చేసిన నేతలకు మాత్రమే మమతా బెనర్జీని కలిసే అవకాశం ఉండేదని శతాబ్ది రాయ్ ఆరోపించారు. మిగిలిన ఎంపీలు, సీనియర్ల గళాన్ని పూర్తిగా నొక్కేశారని, కనీసం తమ నియోజకవర్గ సమస్యలను చెప్పుకుందామన్నా అధిష్ఠానం వినే పరిస్థితి లేదని మండిపడ్డారు. బెంగాల్ ప్రభుత్వంలోని మంత్రులు కూడా ఎంపీలకు అపాయింట్‌మెంట్లు ఇచ్చేవారు కాదన్నారు. ఎలాంటి నిర్ణయాల్లోనూ ఎంపీలను సంప్రదించేవారు కాదని, ఏమైనా మాట్లాడాలని చూస్తే 'నోరు మూసుకుని కూర్చోండి' అని ఆరోపించారు.మరోవైపు తృణమూల్ కాంగ్రెస్‌లో అవినీతి పరాకాష్ఠకు చేరిందని శతాబ్ది రాయ్ ఆరోపించారు. అయితే తనపై ఎలాంటి అవినీతి మరకలు లేవని, ఇమేజ్ క్లీన్ చేసుకోవడానికి తానేమీ పార్టీలు మారడం లేదని, కేవలం ప్రజల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పుకొచ్చారు. పార్టీ బలహీనంగా ఉన్న సమయంలోనే ఎందుకు తిరుగుబాటు చేస్తున్నారన్న ప్రశ్నకు స్పందిస్తూ.. "ఇప్పుడే మాకు అన్ని విషయాలపై స్పష్టత వచ్చింది. అధికారంలో ఉన్నప్పుడు పార్టీ ఎలా ప్రవర్తించిందో చూశాం. నా నియోజకవర్గ ప్రజల భవిష్యత్తు కోసమే ఇప్పుడు ఈ అడుగు వేశాను" అని స్పష్టం చేశారు.

# 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాం

**మొదటి పేజీ రువాయి**

ఖాతాలో వేశామన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. 65.91 లక్షల ఎకరాల్లో 141 లక్షల మెట్రిక్ టన్నుల వరి పండిందని, 52 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని కేంద్రం చెప్పిందని అన్నారు. 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మరో లక్ష మెట్రిక్ టన్నులు వారంలో వస్తాయని తెలిపారు. ధాన్యం కొనుగోళ్లపై మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు.53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు : దేశంలో పండే వరిలో 61 శాతం తెలంగాణలోనే ఉందని మంత్రి ఉత్తమ్ తెలిపారు. పక్కరాష్ట్రం 25 లక్షల మెట్రిక్ టన్నుల వరి మాత్రమే కొనుగోలు చేసిందని, యాసంగి పంటలో పక్క రాష్ట్రాలు తమ కన్నా తక్కువ కొన్నాయని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ద్వారా మహిళా సంఘాలు, పీఏసీలను బలపరుస్తున్నామని, మహిళా సంఘాల ద్వారా 53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయించామని, రూ.171 కోట్లు మహిళా సంఘాలకు ఇచ్చామని వెల్లడించారు. పీఏసీల ద్వారా 90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని వివరించారు.

# మూడువేల బస్సులకు ఓనర్లను చేస్తం

**మొదటి పేజీ రువాయి**

అధికారంలో ఉన్న పార్టీ కూడా మహిళను పార్టీ అధ్యక్షురాలిగా నియమించలేదని సీఎం వ్యాఖ్యానించారు. ప్రస్తుతం మహిళలు మంత్రులు, కార్పొరేషన్ ఛైర్మన్లు, మునిసిపల్ చైర్మన్లు, మేయర్లుగా రాణిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.గత ప్రభుత్వం మహిళలకు ఇవ్వాల్సిన సున్నా వడ్డీ రుణాలను చెల్లించలేదని విమర్శించిన సీఎం, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని మంజూరు చేసినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, దీని ద్వారా వారు విద్య, ఉద్యోగాల కోసం సులభంగా ప్రయాణిస్తున్నారని చెప్పారు. కొందరు ఈ పథకాన్ని వ్యతిరేకించినప్పటికీ ప్రభుత్వం వెనక్కి తగ్గలేదని స్పష్టం చేశారు. పాఠశాలల్లో యూనిఫామ్ కుట్టుపనులు మహిళా సంఘాలకు అప్పగించామని, పెట్రోల్ బంక్‌ల నిర్వహణకు మహిళలను ప్రోత్సహిస్తున్నామని సీఎం తెలిపారు. అదానీతో పోటీ పడేలా సోలార్ విద్యుత్ ప్లాంట్ల నిర్వహణలో కూడా మహిళలను భాగస్వామ్యం చేస్తున్నామని చెప్పారు. హైటెక్ సిటీలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులకు 106 స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళా సంఘాలను కోటి మందికి పెంచి, వారిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు.ఎవరు ఎన్ని కుట్రలు చేసినా కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్నదే మా లక్ష్యం. ఈ వేదికగా మాట ఇస్తున్నానని, కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసే బాధ్యత నాదని సీఎం రేవంత్ వ్యాక్యానించారు. 2034 వరకు ప్రజల ఆశీర్వాదంతో ప్రభుత్వం కొనసాగుతుందని, వెయ్యి కాదు మూడు వేల బస్సుల వరకు మహిళలను యజమానులను చేస్తామన్నారు. వ్యవసాయంలో అన్ని రకాల పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అన్ని రకాల పంటలను వేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆడబిడ్డలను ఆర్థికంగా నిలబెట్టేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తానని సీఎం హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మహిళా శక్తి, మహాలక్ష్మి పథకాల్లో భాగంగా స్వయం సహాయక సంఘాలు, మండల మహిళా సమాఖ్యలకు సీఎం రేవంత్ రెడ్డి చెక్కులను అందజేశారు. 553 బస్సుల అద్దె ఛార్జీల కింద తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నుంచి మండల మహిళా సమాఖ్యలకు రూ.20.34 కోట్ల చెక్కును ఆయన విడుదల చేశారు. ఒక్కో బస్సుకు నెలకు రూ.69,468 చొప్పున అద్దె చెల్లింపులు జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు ఈ బస్సుల నిర్వహణకు సంబంధించిన అద్దె మొత్తంగా రూ.20.34 కోట్లు అందించినట్లు తెలిపారు. ఇదే కార్యక్రమంలో వడ్డీ లేని రుణాల కింద రూ.500 కోట్ల చెక్కును కూడా సీఎం విడుదల చేశారు. అంతేకాకుండా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆదా చేసిన రూ.10,700 కోట్లను సూచించే చెక్కును అందజేశారు.




# విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదం..

**మొదటి పేజీ రువాయి**

క్షతగాత్రులను పరామర్శించారు. బాధితులను స్వయంగా అడిగి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. అనంతరం స్టీల్ ప్లాంట్‌లోని ప్రమాద స్థలాన్ని పరిశీలించి యాజమాన్యం, ఉన్నతాధికారులతో మాట్లాడారు.ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు ప్రకటించారు. గాయపడిన వారికి రూ. 10 లక్షల చొప్పున సాయం అందిస్తామని, వారి పూర్తి చికిత్స ఖర్చులను ఆర్.ఐ.ఎన్.ఎల్. భరిస్తుందని పవన్ కళ్యాణ్ తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరికి స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగం కల్పిస్తామన్నారు. పదవీ విరమణ ప్రయోజనాల కింద రెగ్యులర్ ఉద్యోగులకు రూ. 1.72 కోట్లు, కాంట్రాక్టు ఉద్యోగులకు రూ. 45.75 లక్షలు అందుతాయని వివరించారు. మృతుల పిల్లల చదువులకు కూడా యాజమాన్యం సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.గత 30 ఏళ్లలో ఇలాంటి ఘోర దుర్ఘటన జరగలేదని పవన్ పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన ముందు రోజు రాత్రి కూడా ప్లాంట్‌లో ఇలాంటి చిన్న సాంకేతిక లోపం తలెత్తిందని, అయితే రాత్రి వేళ కార్మికులు ఎవరూ లేకపోవడం వల్ల ఎవరికీ తెలియలేదని తన దృష్టికి తెచ్చారని ఆయన వివరించారు. ప్లాంట్‌లో భద్రతా ప్రమాణాలు, యంత్రాల ఆధునికీకరణపై దర్యాప్తు చేయడానికి ఒక ప్రత్యేక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశామని, వారి నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.స్టీల్ ప్లాంట్ కార్మికుల సమస్యలపై, వారి భద్రతపై త్వరలోనే ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి స్వయంగా కార్మికులతో మాట్లాడతానని పవన్ హామీ ఇచ్చారు. ఇలాంటి ఘోర ప్రమాదాలు జరిగినప్పుడు కేవలం బాధపడి వదిలేయకుండా.. ఉద్యోగుల ప్రాణాలకు రక్షణ కల్పించేందుకు యాజమాన్యం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# విస్తరిస్తున్న రుతుపవనాలు

**మొదటి పేజీ రువాయి**

విస్తరించనున్నట్లు వాతావరణశాఖ అంచనా వేస్తోంది. మరోవైపు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణ మీదుగా కోస్తాంధ్ర వరకు ఒక ద్రోణి కొనసాగుతోంది.

**ఎల్లో హెచ్చరికలు జారీ**

తెలంగాణలో ఇవాళ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించింది. మంగళవారం రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్ష సూచన ఉందని అంచనా వేసింది. ఈ సమయంలో గంటకు 40 నుంచి 50 కి.మీ వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడతాయని తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కామారెడ్డి జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని,ఇవాళ వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని అంచనా వేశారు. ఈ జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

**జూన్ నెల 14 వరకు వర్షాలు**

రుతుపవనాల ప్రభావంతో జూన్ నెల 14 వరకు అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురవనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ఎల్లో హెచ్చరికలు (5 సెం.మీ.లోపు వర్షం) హెచ్చరికలు జారీ చేసింది.

**పెద్దవీడులో 11 సెం.మీ వర్షపాతం**

తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు వానలు పడ్డాయి. అత్యధికంగా సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం పెద్దవీడులో 11.1 సెం.మీ. వర్షం కురిసింది. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం రాచులూరులో 8.7, మహేశ్వరంలో 7.3, నల్గొండ జిల్లా దామరచర్లలో 7.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

**హైదరాబాద్ వాతావరణశాఖ డైరెక్టర్‌గా ఎస్.స్టెల్లా**

వాతావరణశాఖ హైదరాబాద్ డైరెక్టర్ కె.నాగరత్న అమరావతికి బదిలీ అయ్యారు. వాతావరణశాఖ హైదరాబాద్ డైరెక్టర్‌గా ఎస్.స్టెల్లా బాధ్యతలు చేపట్టారు. అమరావతి నుంచి ఆమె బదిలీపై హైదరాబాద్‌కు వచ్చారు.

# దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి

**మొదటి పేజీ రువాయి**

బీజేపీ అధికారంలో ఉందంటే అది రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీల దయాదాక్షిణ్యాల వల్లేమీ కాదు. నేను అంబర్‌పేట్, సికింద్రాబాద్ ప్రజల ఆశీస్సులతో ఢిల్లీకి వెళ్లాను. రేవంత్ రెడ్డికి సమాధానం చెప్పాల్సిన అవసరం నాకు లేదు. తెలంగాణ ప్రజలకు, నా నియోజకవర్గానికి, నా పార్టీకి మాత్రమే నేను జవాబుదారీని" అని స్పష్టం చేశారు.తెలంగాణ అభివృద్ధి, పెండింగ్ ప్రాజెక్టులపై సీఎం రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. "రేవంత్ రెడ్డికి దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలి. ప్రెస్ క్లబ్ అయినా సరే లేదా అమరవీరుల స్తూపం ముందైనా సరే నేను చర్చకు సిద్ధం" అని ప్రకటించారు. తాను తెలంగాణకు రావాల్సిన ఏ ఒక్క ప్రాజెక్టునైనా అడ్డుకున్నానని నిరూపిస్తే తక్షణమే రాజీనామా చేస్తానని, దీనిపై సీనియర్ జర్నలిస్టులతో ఒక కమిటీని వేసి విచారణ జరిపించాలని సవాల్ విసిరారు.తుమ్మిడిహట్టి ప్రాజెక్టు, మెట్రో ఫేజ్-2 పై సీఎం చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని వెల్లడించారు. తుమ్మిడిహట్టి అపాయింట్‌మెంట్ వ్యవహారంపై రేవంత్ రెడ్డి ఆధారాలు లేని ఆరోపణలు మానేసి, పద్ధతిగా అధికారికంగా అపాయింట్‌మెంట్ కోరాలని సూచించారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు తమ అవినీతి, తప్పుడు నిర్వహణతో మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణను అప్పుల పాలు చేశాయని కిషన్ రెడ్డి విమర్శించారు.

### ఉద్యోగుల జీతాల చెల్లింపులో

# జాప్యం వద్దు..

**మొదటి పేజీ రువాయి**

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల చెల్లింపులో జాప్యంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతాల ఆలస్యానికి బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. సీఎం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల చెల్లింపుపై ఆర్థిక శాఖ కీలక సర్క్యులర్ జారీ చేసింది. రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, హానరేరియం ఉద్యోగులందరికీ 1వ తేదీన వేతనాలు వేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆలస్యమైతే హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్, డీడీఓలదే బాధ్యతని తెలిపారు. ప్రతి నెల 25వ తేదీలోపు జీతాల బిల్లులు ట్రెజరీకి సమర్పించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.ఈ నెలాఖరులోపు బిల్లుల స్క్రూటినీ, ఆడిట్, అథరైజేషన్ పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి హుకుం జారీ చేశారు. బడ్జెట్ కొరత లేదా సాంకేతిక సమస్యలు ఉంటే ముందుగానే ఫైనాన్స్ శాఖకు తెలియజేయాలని సూచించారు. జీతాల చెల్లింపులో పరిపాలనా నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. అన్నిశాఖలు, కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, సొసైటీలు ఉత్తర్వులు ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఉద్యోగికి ప్రతి నెల 1వ తేదీన జీతం చేరేలా ప్రత్యేకంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ మేరకు ఫైనాన్స్ శాఖ కార్యదర్శి డా. గౌరవ్ ఉప్పల్‌కు సమన్వయ బాధ్యతలను సీఎం రేవంత్‌రెడ్డి అప్పగించారు

# బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు

## రామచంద్రాపురం డివిజన్‌లో అవగాహన సమావేశం



**రామచంద్రపురం, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09:**
తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు, మాజీ మంత్రివర్యులు హరీష్ రావు ఆదేశాల మేరకు పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని లక్ష్మీ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ సూచనల మేరకు డివిజన్ పరిధిలోని ప్రతి బూత్ స్థాయిలో డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి బూత్ నుంచి ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగంపై అవగాహన కలిగి ఉండి, పార్టీ సభ్యత్వ నమోదు చేయగల ఇద్దరు యువతతో పాటు సీనియర్ బూత్ కోఆర్డినేటర్‌ను ఎంపిక చేసి ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారుపటాన్‌చెరు నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో ప్రజలను చేరుకునే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపడుతున్నామని, ప్రతి కార్యకర్త ప్రజలతో మమేకమై పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రభుత్వం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి కూడా ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. బూత్ స్థాయిలో ఓటర్ల వివరాలను పరిశీలించడం ద్వారా డూప్లికేట్ ఓటర్లు, మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి, పరమేష్ యాదవ్, గోవింద్ యాదవ్, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ సమేతంగా ప్రముఖ

# పుణ్యక్షేత్రాలను దర్శించుకున్న ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

### తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని, శ్రీకాళహస్తి దేవస్థానంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కుటుంబ సమేతంగా శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు చేశారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని శ్రీ వెంకటేశ్వర స్వామిని



ప్రార్థించినట్లు తెలిపారు. ఆలేరు నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, ఆనందంగా ఉండాలని ప్రత్యేకంగా మొక్కులు చెల్లించుకున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రజా సేవలో మరింత నిబద్ధతతో పనిచేసేలా స్వామివారి ఆశీస్సులు కోరుకున్నట్లు తెలిపారు.

**శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు......**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీకాళహస్తి దేవస్థానం లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం లో శ్రీవారిని దర్శించుకున్న అనంతరం, శ్రీకాళహస్తికి చేరుకున్న బీర్ల ఐలయ్య ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ సంప్రదాయాలను అనుసరించి భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకి వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, తెలంగాణ అభివృద్ధి మరింత ముందుకు సాగాలని ఆయన స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తులు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యని ఆప్యాయంగా పలకరించగా, ఆయన కూడా భక్తులతో మమేకమై మాట్లాడారు. తిరుపతి దర్శనం అనంతరం శ్రీకాళహస్తి స్వామివారిని దర్శించుకోవడం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని ఆయన పేర్కొన్నారు.

# రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం: ఎమ్మెల్యే జిఎంఆర్

**15 లక్షల రూపాయల సొంత నిధులతో ఏర్పాటు చేసిన పటాన్చెరు ఎం ఎల్ ఎస్ పాయింట్ వే బ్రిడ్జి ప్రారంభం..**

**అతి త్వరలో సంగారెడ్డి, జహీరాబాద్, నర్సాపూర్ లోనూ వే బ్రిడ్జిలు ఏర్పాటు..**

**పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి..**

**పటాన్ చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09 :**
రేషన్ డీలర్ల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. స్టాక్ పాయింట్లో ధాన్యం తూకం వేసే సమయంలో డీలర్లు నష్టపోవద్దన్న లక్ష్యంతో పటాన్చెరులోని ఎంఎల్ఎస్ పాయింట్ లో 15 లక్షల రూపాయల సొంత నిధులతో ఏర్పాటుచేసిన వే బ్రిడ్జిను మంగళవారం పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి స్వయంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిరంతరం ప్రజలతో సత్సంబంధాలు కలిగిన రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. స్టాక్ పాయింట్లలో వే బ్రిడ్జి లేకపోవడం మూలంగా ధాన్యం ధూపం వేసే సమయంలో ప్రతిసారి నష్టపోతున్నామని గతంలో రేషన్ డీలర్లు తన దృష్టికి తీసుకునే రావడం జరిగిందని.. వెంటనే సొంత నిధులు కేటాయించి ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వాలు చేయాల్సిన పని తాను చేయడం జరిగిందని గుర్తు చేశారు. అతి త్వరలో సంగారెడ్డి, జహీరాబాద్, నర్సాపూర్ స్టాక్ పాయింట్లలోనూ వే బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని డీలర్లు కోరగా.. వచ్చే రెండు వారాల్లో బ్రిడ్జి ల ఏర్పాటునకు శంకుస్థాపన చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి ఎంఎల్ఎస్ పాయింట్లలో వే బ్రిడ్జి లు ఏర్పాటు చేసి రేషన్ డీలర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని అతి త్వరలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విన్నవించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా రేషన్ డీలర్ల సంక్షేమం కోసం 15 లక్షల రూపాయలు సొంత నిధులతో వే బ్రిడ్జి ఏర్పాటు చేసిన ఘనత. ఎమ్మెల్యే గూడెం



మహిపాల్ రెడ్డి కే దక్కిందని డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు ప్రశంసించారు. తమ సంక్షేమం ఆర్థిక అభ్యున్నత కోసం అహర్నిశలు కృషి చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అనంతం, జిల్లా ఉపాధ్యక్షులు జయప్రకాష్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్ చారి, వెంకటేష్, ధనరాజ్ గౌడ్, రాజు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు

# గండిగూడెం చెరువు అభివృద్ధికి చర్యలు..

## కాలుష్యకారక జలాలు చేరకుండా ప్రత్యేక కాలువ

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**అమీన్పూర్, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09 :**
అమీన్పూర్ డివిజన్ పరిధిలోని గండిగూడెం చెరువులోకి కాలుష్య జలాలు చేరకుండా ప్రత్యేక కాలువ నిర్మించనున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం గండిగూడెం చెరువులో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ప్రధానంగా చెరువు అలుగు పెంచడం మూలంగా సమీపంలోని ఖాజిపల్లి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వర్షాకాలంలో నీటిమట్టం పెరిగి ఇళ్ళలోకి నీళ్లు చేరుతున్నాయని ఇటీవల ప్రజలు తన దృష్టికి తీసుకొని రావడం జరిగిందని పేర్కొన్నారు. అలుగు మట్టాన్ని పూర్వస్థితికి తీసుకుని రావడంతో పాటు.. పరిశ్రమల నుండి కాలుష్య జలాలు చెరువులోకి చేరకుండా చెరువు సమీపం నుండి ప్రత్యేక కాలువ నిర్మించి వాటిని బయటకు పంపించడం జరుగుతుందని తెలిపారు. పరిశ్రమలు కాలుష్య జలాలు వదలకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు భాస్కర్ గౌడ్, రాజు, గణేష్, నవీన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



# 10న జరిగే ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలి....

### సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిగుర్ల లింగం




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని మంగళవారం రోజు సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిగుర్ల లింగం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 10న యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు జరిగే ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాజపేట మండల కేంద్రంలో కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు ఒగ్గు కరుణాకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు మూల పోచయ్య, హమాలి సంఘం అధ్యక్షుడు దయ్యాల సిద్ధులు, ఎండి దస్తగిరి, పుట్ట గణేష్, ఆకుల బాలనరసయ్య, జంగ అంజయ్య, పండుగ పెద్దులు, ఉప్పల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభ ఎన్నికల్లో భారీ ట్విస్ట్- కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ..!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09, సెంట్రల్ బ్యూరో:**
ఈ నెల 18వ తేదీన జరిగే రాజ్యసభ ఎన్నికలపై ఉత్కంఠ పెరుగుతోంది. ఈ ఎన్నికల్లో గెలిస్తే రాజ్యసభలో మూడింటి రెండొంతుల మెజార్టీ సాధించే అవకాశం ఉండటంతో బీజేపీ వీటిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఇదే క్రమంలో మధ్యప్రదేశ్ నుంచి పోటీకి దిగిన కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ ను ఓడించేందుకు ఇప్పటికే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేస్తుండటంతో వారంతా బెంగళూరు క్యాంప్ కు తరలివెళ్లారు. అయితే ఆ తర్వాత కూడా మీనాక్షి నటరాజన్ కు షాక్ తప్పలేదు. మధ్యప్రదేశ్ నుంచి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్ సమర్పించిన నామినేషన్ అఫిడవిట్ లో ఆమె.. తెలంగాణలో నమోదైన ఓ క్రిమినల్ కేసుకు సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టినట్లు నిర్ధారించి ఎన్నికల అధికారులు దాన్ని తిరస్కరించారు. నటరాజన్ అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ బీజేపీ నాయకులు రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయడంతో ఆ మేరకు ఈసీ అధికారులు వెంటనే నిర్ణయం తీసేసుకున్నారు. కాంగ్రెస్ ఈ అభ్యంతరాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. అది నిరాధారమైనదని పేర్కొంది. నటరాజన్ ఎలాంటి క్రిమినల్ కేసును ఎదుర్కోవడం లేదని, అందువల్ల బీజేపీ పేర్కొన్న విషయాన్ని వెల్లడించాల్సిన అవసరం ఆమెకు లేదని ప్రతిపక్ష నాయకుడు ఉమాంగ్ సింఘర్, ఇతర పార్టీ నాయకులు స్పష్టం చేశారు. తెలంగాణ విషయం కేవలం ఒక కోర్టు నోటీసుకు మాత్రమే సంబంధించింది కానీ, అధికారికంగా నమోదైన క్రిమినల్ కేసుకు కాదని కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఈసీ మార్గదర్శకాల ప్రకారం, అభ్యర్థులు అధికారికంగా నమోదై, కోర్టులలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులను మాత్రమే వెల్లడించాలి కానీ, సాధారణ న్యాయపరమైన నోటీసులను కాదని ఆ పార్టీ వాదిస్తోంది.

# డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కు ఘన సన్మానం

### డిప్యూటీ సీఎం ను సన్మానించిన ఎమ్మెల్యే కుంభం, చైర్‌పర్సన్ శ్రీవాణి రవికుమార్




**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ టి.జి.ఎస్.పి.డి.సి.ఎల్.), యాదాద్రి భువనగిరి జిల్లా ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ మౌలిక సదుపాయాల ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రివర్యులు భట్టి విక్రమార్క ని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, భువనగిరి పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి తంగళ్లపల్లి శ్రీవాణి, పిసిసి డెలిగెట్ తంగళ్ళ పల్లి రవికుమార్ ఘనంగా సన్మానించారు.

# 2047 నాటికి వికసిత్ భారత్: సంస్కరణలను వేగవంతం చేయాలని మంత్రులకు ప్రధాని మోదీ ఆదేశాలు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09, సెంట్రల్ బ్యూరో :**
భారతదేశాన్ని 2047 నాటికి వికసిత్ దేశంగా తీర్చిదిద్దే లక్ష్యాలను చేరుకోవడానికి సంస్కరణల ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంత్రులకు సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్లు పెండింగ్‌లో ఉండకూడదని, ప్రతి శాఖ తమ కార్యకలాపాలను చురుగ్గా నిర్వహించాలని ఆయన ఆదేశించారు.ప్రపంచవ్యాప్తంగా భారతదేశానికి లభిస్తున్న సానుకూలతలను సద్వినియోగం చేసుకోవాలని, ఇందుకోసం అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని ప్రధాని మోదీ సూచించారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా దేశాభివృద్ధికి దోహదపడాలని ఆయన అభిప్రాయపడ్డారు.వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి ఇదే సరైన సమయమని ప్రధాని అభివర్ణించారు. సంస్కరణల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, వారి జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడం ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని ఆయన నొక్కి చెప్పారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం పనిచేయాలని, సంస్కరణల అమలులో ఎటువంటి జాప్యం జరగకూడదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. దేశం పురోగతి సాధించాలంటే, ప్రతి స్థాయిలోనూ వేగవంతమైన, సమర్థవంతమైన పనితీరు అవసరమని ఆయన అన్నారు.

# మల్కాజ్గిరి నియోజకవర్గ అభివృద్ధి, దేవాలయాల పరిరక్షణపై వినతిపత్రం

## దేవాదాయ శాఖ మంత్రిని కలిసిన మల్కాజ్గిరి ఎమ్మెల్యే





**సచివాలయం, హైదరాబాద్,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
మంగళవారం రోజు మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖని మర్యాదపూర్వకంగా కలిసి మల్కాజ్‌గిరి నియోజకవర్గానికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై వినతిపత్రాలు అందజేశారు. మల్కాజ్గిరి డివిజన్ శివపురి కాలనీలో ఉన్న శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయాన్ని దేవాదాయ శాఖ పరిధి నుండి మినహాయించి చారిటబుల్ ట్రస్ట్ కింద పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఓల్డ్ మల్కాజ్‌గిరిలోని శ్రీ విష్ణు దేవాలయానికి చెందిన స్థలంలో మున్నూరు కాపు భవనం నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ అంశాలపై మంత్రి కొండా సురేఖ సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకునేలా అధికారులకు సూచనలు చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బీ.ఆర్.ఎస్ సీనియర్ నాయకులు మేకల రాము యాదవ్, వెంకన్న,నవీన్ పాల్గొన్నారు. అలాగే శివా పూరి కాలనీ వాసులు మూర్తి రామశర్మ, మల్లికార్జున్, సుబ్రహ్మణ్యం, మోహన్ రెడ్డి, రామకృష్ణ, నాగరాజు. మున్నూరు కాపు సంఘం నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నారాయణఖేడ్ మున్సిపాలిటీని అభివృద్ధి చేసింది బిఆర్ఎస్ ప్రభుత్వమే

**మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09, నారాయణ ఖేడ్ :**
నారాయణఖేడ్ పట్టణాన్ని మున్సిపాలిటీగా మార్చింది బిఆర్ఎస్ ప్రభుత్వమే, మున్సిపాలిటీని అభివృద్ధి చేసింది బిఆర్ఎస్ ప్రభుత్వమే అని తెలిపిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఆధ్వర్యంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పట్టణాన్నీ మున్సిపాలిటీగా మార్చాను మార్చిన మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించాను.కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ఎమ్మెల్యే అభివృద్ధి పనులు మానుకొని అభివృద్ధి చేయడం చేతకాక లేనిపోని మాటలు మాట్లాడుతూ కాలాన్ని గడుపుతున్నాడు.. నిన్న ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఎక్కడైనా గుంతలు పడితే ప్రజలు మట్టిని తెచ్చి వాటిని పూడ్చాలని తెలిపారు. అంటే దీనికి అర్థం పాలన గాడి తప్పిందని మాకు చేతకాదు అని ప్రజలే రోడ్లను వేసుకోవాలి అని తెలియజేస్తున్నారు. ప్రజల రోడ్డు వేసినప్పుడు మున్సిపాలిటీకి ప్రజలు టాక్స్ ఎందుకు కట్టాలో మీరు ట్యాక్స్ ఎందుకు తీసుకుంటున్నారు. తెలియజేయవలసిన అవసరం ఎమ్మెల్యే కి ఉంది అని తెలిపారు.మేము అన్ని నిధులు తెచ్చాము ఇన్ని నిధులు తెచ్చామని చెప్పడం మానేయ్ తెచ్చిన నిధులు ఎక్కడున్నాయో వాటి జీవోలతో పాటు మీరు ఎక్కడ వర్క్ చేశారో చూపించాలి అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నజీబ్ పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సెట్ మాజీ సర్పంచ్ సంగప్ప తదితరులు ఉన్నారు.

# క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని కలిసిన సామాజిక పర్యావరణ వేత్త కోల రవీందర్ ముదిరాజ్



**కుత్బుల్లాపూర్, జూన్ 09, హైదరాబాద్ పల్స్ న్యూస్ :**
ఈతను పాఠ్యాంశంలో చేరుస్తామని ప్రకటన చేసినందుకు మంత్రిని కలిసి కర్రతో చేసిన చేప బొమ్మను ఇస్తూ శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కోలా రవీందర్ మాట్లాడుతు నా పోరాటం ఈతను పాఠ్యాంశంలో చేర్చాలని 25 ఏళ్లుగా అన్ని ప్రభుత్వాలకు విన్నవించుకుంటున్న కానీ ఎవ్వరు పట్టించుకోలేదు. ఈసారి మంత్రి శ్రీహరి స్పందిస్తూ ఇది తప్పనిసరిగా క్యాబినెట్ మీటింగ్ లో పెట్టి ముఖ్యమంత్రితో చర్చించి పాఠ్యఅంశంలో చేర్చే విధంగా ప్రయత్నిస్తాను అని ఆ వెంటనే సంబంధిత అధికారులకు క్రీడా శాఖ వారికి, విద్యాశాఖ వారికి, వివరిస్తూ మాట్లాడి ఈ ఒక సబ్జెక్టును జరగబోయే క్యాబినెట్ మీటింగ్ లో అందివ్వాలని సంబంధిత అధికారులకు ఆర్డర్ పాస్ చేసారు ఇతను పాఠ్య అంశంలో చేర్చడానికిహామీ ఇస్తున్నాను మొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని నలుగురు పిల్లలు ఈత రాక సాధన అని తెలియక నీటిలో ప్రాణాలు వదిలారు రవీందర్ ముదిరాజ్ పేరుకొన్నారు. మంత్రి శ్రీహరి మాట్లాడుతూ ఈ పర్యావరణ ప్రేమికుడు చేస్తున్నటువంటి ఈ పోరాటాన్ని నేను పూర్తిగా అర్థం చేసుకున్నాను అయన సేకరిస్తున్నటువంటి ఈ యొక్క డాటాను నేను చూసి అభినందిస్తున్నాను అన్నారు. రవీందర్ ముదిరాజ్ను షాలువతో సన్మానించి నీవద్ద ఇంకేదైనా సమాచారం, ఉంటే నాకు అందించవలసిందిగా తెలియజేయడం అని కోరారు. ఈ కార్యక్రమంలో బాచుపల్లి మాజీ కార్పొరేటర్, సర్పంచ్ ఆగం పాండు, రాబోలు, జితేందర్, రాజేష్ పాల్గొన్నారు.

# పర్మిషన్లు లేని పాఠశాలల దోపిడీని ప్రశ్నిస్తే అరెస్టా?

**టీ.పి.వై.ఎఫ్, ఆర్.ఎస్.యూ, వి.సి.కే, యూ.ఎస్.ఎఫ్.ఐ నాయకుల అక్రమ అరెస్టు**







**బాలానగర్, జూన్ 09,హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :**
కూకట్పల్లి నియోజకవర్గంలోని బాల నగర్ మండలం ఫిరోజ్‌గూడలోని సదాశివ స్కూల్ యాజమాన్యం ఎలాంటి అనుమతులు లేకుండా స్కూల్ నిర్వహిస్తూ, విద్యార్థుల తల్లిదండ్రుల నుండి యూనిఫాం, నోట్‌బుక్స్ అంటు అధిక ఫీజులు దోపిడీ చేస్తున్న తీరును ప్రశ్నిస్తూ మంగళవారం రోజు తెలంగాణ ప్రోగ్రెసివ్ యూత్ ఫెడరేషన్ (టీ.పి.వై.ఎఫ్) ఆధ్వర్యంలో శాంతియుత నిరసన చేపట్టారు.నిరసనలో పాల్గొన్న టీ.పి.వై.ఎఫ్, ఆర్.ఎస్.యూ, వి.సి.కే, యూ.ఎస్.ఎఫ్.ఐ పార్టీ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి బాలానగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.ఈ సందర్భంగా టీ.పి.వై.ఎఫ్ నాయకులు మండిపడుతూ పర్మిషన్లు లేకుండా స్కూల్ నడిపి వేలకు వేలు దోపిడీ చేస్తున్న సదాశివ స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోకుండా, ప్రశ్నించిన మాపై కేసులు పెట్టడం దారుణం. ఎలాంటి యూనియన్ స్కూల్ లోపల ప్రవేశం లేదు అంటూ స్కూల్ గేట్‌పై బోర్డు పెట్టి విద్యార్థుల తల్లిదండ్రులను, ప్రజాసంఘాలను బెదిరిస్తున్నారు. ఇది రాజ్యాంగం ఇచ్చిన హక్కుకు విరుద్ధం. ఆర్టీఈ యాక్ట్ 2009, సెక్షన్ 18 ప్రకారం అనుమతి లేకుండా స్కూల్ నడపడం నేరం. దోపిడీ చేస్తున్న స్కూల్‌పై చర్యలు తీసుకోకుండా, నిరసన తెలిపిన మమ్మల్ని అరెస్టు చేయడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పలు డిమాండ్లు చేసారు. అక్రమంగా అరెస్టు చేసిన టీ.పి.వై.ఎఫ్, ఆర్.ఎస్.యూ, వి.సి.కే, యూ.ఎస్.ఎఫ్.ఐ పార్టీ నాయకులను వెంటనే విడుదల చేయాలి.పర్మిషన్లు లేకుండా నడుస్తున్న సదాశివ స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వెంటనే స్కూల్‌ను సీజ్ చేయాలి. బుక్స్, యూనిఫాం దోపిడీపై విచారణ జరిపి తల్లిదండ్రులకు న్యాయం చేయాలి. అరెస్టులతో యూనియన్ గొంతు నొక్కలేరు. పేద విద్యార్థుల హక్కుల కోసం పోరాటం ఆగదు అని హెచ్చరించారు.

# తెలంగాణలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు..రాగల 3 రోజులు భారీ వర్షాలు!






**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09, మెయిన్ డెస్క్:**
ఎండవేడిమితో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు చెప్పింది. రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు అధికారికంగా ప్రవేశించాయి. జూన్ 8న దక్షిణ తెలంగాణలోని జోగులాంబ గద్వాల జిల్లా ద్వారా ఇవి రాష్ట్రంలోకి అడుగుపెట్టాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం ఇవి కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రతో పాటు దక్షిణ తెలంగాణ ప్రాంతాల్లో విస్తరిస్తున్నాయి. రాబోయే రెండు మూడు రోజుల్లో రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలకూ రుతుపవనాలు విస్తరించడానికి వాతావరణం అనుకూలంగా ఉంది. తూర్పు ఉత్తరప్రదేశ్ నుండి ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్ వరకు విస్తరించిన ద్రోణి ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి.రుతుపవనాల రాకతో రాబోయే కొన్ని రోజుల పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని ఐఎండి అంచనా వేసింది. ముఖ్యంగా దక్షిణ, తూర్పు తెలంగాణ జిల్లాల్లో రాగల మూడు రోజుల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. అలాగే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, కరీంనగర్, గద్వాల జిల్లాల్లో గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో వీచే గాలులు, పిడుగులతో కూడిన తుఫాను సంభవించే అవకాశం ఉంది.జూన్ 9 ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. అలాగే జూన్ 10 నాటికి జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు పడతాయని అధికారులు తెలిపారు. గత కొన్ని వారాలుగా సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలతో సతమతమవుతున్న ప్రజలకు ఈ రుతుపవనాల రాక పెద్ద ఉపశమనాన్ని ఇచ్చింది. గడిచిన 24 గంటల్లోనే సూర్యాపేట, రంగారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. ఈ వానలు ఊపందుకోవడంతో ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులకు కష్టలు నష్టాలు

**పనిచేయని వ్యవసాయ శాఖ అధికారులతో రైతుల తిప్పలు...**

**తప్పుడు పంటల నమోదుతో అన్నదాతల అష్ట కష్టాలు....**



హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండల వ్యవసాయ శాఖ అధికారుల నిర్వాకంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతూ... కష్టలు నష్టాలు చవిచూస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రణాళికలో భాగంగా వారం రోజుల పాటు వ్యవసాయ శాఖ చేపట్టాల్సిన కార్యక్రమాలను రాజపేట మండలంలో జరగలేదు. దీంతో ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సేవా సదుపాయాలు లక్ష్యాలు తెలవకుండా పోయింది. వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉండకపోవడం, పర్యవేక్షణ లోపం, వివిధ పథకాలు లబ్ధి పొందేందుకు చేసుకున్న దరఖాస్తులు ముందుకు సాగకపోవడం రైతులకు అవసరమైన సలహాలు సూచనలు లభించకపోవడం, పంటల సర్వే నమోదు సరిగ్గా చేయకపోవడం రైతులు నష్టపోవడం లాంటి అనేక సమస్యలు రాజపేట మండల అన్నదాతలకు సవాళ్లుగా మారాయి. పంటల నమోదు విషయంలో జరిగిన అన్యాయం పట్ల రైతులు ఆందోళన చేసి ఫిర్యాదు చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం పంటను కొనుగోలు కేంద్రాలలో విక్రయిస్తున్న సమయంలో కనీసం వ్యవసాయ అధికారులు ఆటు వైపు కూడా వెళ్లకపోవడం పట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కార్యాలయంలో సమావేశం పేరుతో రాజపేట మండల వ్యవసాయ శాఖ అధికారులు ఎక్కువ రోజులు డుమ్మా కొట్టడం బహిరంగ రహస్యంగా మారింది. రాజపేట మండలానికి వ్యవసాయ శాఖ అధికారులు అక్కడకు రాకుండా పోవడంతో పలు సమావేశంలో అనేకసార్లు తమ ఆవేదనను వెళ్ళగక్కిన సందర్భాలు కూడా ఉన్నాయి. స్వయంగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సమక్షంలో కూడా రైతులు తమ ఆవేశాన్ని ఆగ్రహాన్ని ప్రదర్శించారు. అయినప్పటికీ రాజపేట మండల వ్యవసాయ శాఖ అధికారుల పనితీరులో ఎలాంటి మార్పు లేకపోవడంతో పట్టింపులేని జిల్లా అధికారిని కూడా రైతన్నలు దూషిస్తున్నారు. జిల్లా అధికారిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# బాలికపై అత్యాచార యత్నం.. ఆపై అపార్ట్ మెంట్ నుండి తోసేసి.. ఖమ్మంలో దారుణం!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09, తెలంగాణ బ్యూరో:** మహిళలు, బాలికల కోసం ఎన్ని రక్షణా చట్టాలు వచ్చినా నేటికీ సమాజంలో మహిళలు, పిల్లలు లైంగిక వేధింపులను ఎదుర్కొంటూనే ఉన్నారు. ఎన్ని కఠిన చట్టాలు ఉన్నా, దోషులకు కఠిన శిక్షలు పడుతున్నా పరిస్థితులలో ఏ మాత్రం మార్పు లేదు. తాజాగా ఖమ్మం నగరంలో అత్యంత దారుణమైన మరియు మనస్తాపం కలిగించే సంఘటన ఒకటి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

**మైనర్ బాలికపై లైంగిక దాడి యత్నం**

కేవలం 12 ఏళ్ల వయసున్న ఒక మైనర్ బాలికపై ఒక కిరాతకుడు లైంగిక దాడికి ఒడిగట్టడమే కాకుండా, ఆమె ప్రాణాలను సైతం ప్రమాదంలోకి నెట్టేసిన ఉదంతం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఖమ్మం రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక అపార్ట్‌మెంట్‌లో ఈ ఘోరం జరిగింది. బాధిత బాలిక తల్లిదండ్రులు సదరు అపార్ట్‌మెంట్ వద్ద వాచ్‌మెన్ గా విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు.

**గట్టిగా అరవటంతో అపార్ట్ మెంట్ పైనుండి క్రిందికి తోసేసిన దారుణం**

జూన్ 6వ తేదీన అదే అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న ఒక వ్యక్తి, ఒంటరిగా ఉన్న ఆ బాలికపై లైంగిక దాడికి పాల్పడటానికి ప్రయత్నించాడు. అయితే తను ఏమాత్రం ఊహించని ఈ ప్రమాదం నుండి తనను తాను రక్షించుకోవడానికి ఆ బాలిక తీవ్రంగా భయపడి గట్టిగా కేకలు వేసింది. ఆమె అరుపులకు ఎక్కడ దొరికిపోతానో అన్న భయంతో, ఆ కిరాతకుడు ఆమెను అపార్ట్‌మెంట్ పైభాగం నుండి కిందికి దారుణంగా తోసేశాడు.

**బాలిక వెన్నెముక, పక్కటెముకలకు తీవ్ర గాయాలు**

భవనం పైనుంచి కిందపడటంతో ఆ చిన్నారికి తీవ్రమైన గాయాలయ్యాయి. ముఖ్యంగా ఆమె వెన్నెముక మరియు పక్కటెముకలు విరిగిపోవడంతో తీవ్ర రక్తస్రావమై స్పృహతప్పి పడిపోయింది. అయితే ఆ బాలిక చనిపోతే తన గురించి ఎవరికీ చెప్పలేదని, ప్రమాదవశాత్తు పడినట్టు చిత్రీకరించవచ్చని సదరు మృగాడు భావించాడు.

**పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు**

కానీ బాలిక తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరింది. ప్రమాదాన్ని గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు కలిసి ఆమెను తక్షణమే ఖమ్మంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె అక్కడ అత్యవసర విభాగంలో చికిత్స పొందుతోంది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు నిందితుడిపై పోక్సో తో పాటు, సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తును వేగవంతం చేశారు.

# కేంద్రం బిగ్ హింట్.. త్వరలో తగ్గనున్న పెట్రోల్, డీజిల్ ధరలు.!



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09, సెంట్రల్ బ్యూరో:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గడం లేదు. 100 రోజులకు పైగా ఇరాన్- అమెరికా మధ్య యుద్ధం కొనసాగుతూనే ఉంది. దాంతో అంతర్జాతీయ మార్కెట్ లో చమురు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ క్రమంలో దేశీయ చమురు మార్కెటింగ్ సంస్థలు ఎదుర్కొంటున్న నష్టాలను తగ్గించేందుకు మే 15 నుంచి పెట్రోల్, డీజిల్ రేట్లను కేంద్రం పెంచుతూ వచ్చింది. 10 రోజుల వ్యవధిలో వరుసగా 4 సార్లు రేట్లను సవరించింది. మే 15 న తొలిసారి లీటర్ కు రూ. 3 చొప్పున పెంచింది. చివరగా మే 25 న లీటర్ పెట్రోల్ పై రూ. 2.80 పెంచారు. అయితే దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ రేట్ల పెంపుతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న క్రమంలో కేంద్ర ప్రభుత్వం కీలక హింట్ ఇచ్చింది.ఈ మేరకు త్వరలోనే ఇంధన ధరలు తగ్గే అవకాశం ఉందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి పేర్కొన్నారు. అమెరికా- ఇజ్రాయెల్- ఇరాన్ ఘర్షణల కారణంగా అంతర్జాతీయ మార్కెట్ లో ముడిచమురు ధరలు బ్యారెల్ కు దాదాపు 100 డాలర్ల సమీపానికి చేరుకున్నాయి. దీనివల్ల దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్ కు రూ. 7 వరకు పెరిగాయి. అయితే ఈ ధరలు ఎక్కువ కాలం కొనసాగే అవకాశం లేదని.. రాబోయే రోజుల్లో చమురు ధరలు తగ్గుముఖం పడతాయని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.అంతర్జాతీయంగా సరఫరాకు ఏమైనా అడ్డంకులు ఏర్పడితే వాటిని అధిగమించేందుకు వీలుగా భారత్ వద్ద 70 నుంచి 80 రోజులకు సరిపడా చమురు, గ్యాస్ నిల్వలు ఉన్నట్లు ఇటీవల కేంద్రం స్పష్టం చేసిన విషయం తెలిసిందే. ఇక ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరా ఆగిపోకుండా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గించి శాంతిని నెలకొల్పాలని భారత్ మొదటి నుంచి విజ్ఞప్తి చేస్తోంది. ప్రపంచ చమురు, గ్యాస్ సరఫరాలో దాదాపు 20 శాతం హార్మూజ్ జలసంధి నుంచే సరఫరా అవుతోంది. హార్మూజ్ జలసంధిపై ఉద్రిక్తతలు తగ్గితే ధరలు మరింత వేగంగా అదుపులోకి వస్తాయని భారత్ భావిస్తోంది.ఇక ప్రస్తుతం దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 102 ఉండగా లీటర్ డీజిల్ ధర రూ. 95 గా ఉంది. అలాగే ముంబైలో లీటర్ పెట్రోల్ ధర రూ. 111 గా ఉంది. డీజిల్ ధర రూ.97 గా ఉంది. అలాగే కోల్ కతా లో లీటర్ పెట్రోల్ ధర రూ. 113, చెన్నైలో రూ. 107 గా ఉంది. ఇక హైదరాబాద్ లో లీటర్ డీజిల్ ధర రూ. 103 కాగా, బెంగళూరులో రూ. 98 గా ఉంది.

# జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ ఇవ్వండి

## హైదరాబాద్ కలెక్టర్, డీఈవోలకు టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కమిటీ విజ్ఞప్తి





**హైదరాబాద్, జూన్ 09, హైదరాబాద్ పల్స్ ప్రతినిధి :** హైదరాబాద్ జిల్లాలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 2026-27 విద్యా సంవత్సరాలలో ఫీజుల్లో 50 శాతం రాయితీ కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) హైదరాబాద్ జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది.ఈ మేరకు జిల్లా కమిటీ ప్రతినిధులు మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా ను కలిసి వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తున్న జర్నలిస్టుల సంక్షేమాని ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలో బాగంగా వారి పిల్లల చదువులకు సహకరించాలని కోరారు. ప్రస్తుతం జిల్లాలో అనేక మంది జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దాదాపు 80 శాతం మంది జర్నలిస్టులు వేతనాలు సరిగా లేక నెలవారీ ఆదాయం లేక వారి పిల్లలను చదివించుకోలేక, కుటుంబాలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లల ఫీజులు కట్టలేకపోతున్నారని, ఈ పరిస్థితిలో జర్నలిస్టుల పిల్లలకు ప్రతి ప్రైవేట్ పాఠశాలలో 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని వారు కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల కుటుంబాల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రాయితీలు అమలు చేయాలని కోరారు. రాబోయే 2026-27 విద్యా సంవత్సరం ఆరంభం అయ్యేనాటికి జర్నలిస్టుల పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ ను కలిసి వారిలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో-కన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్,ఎం. రవికుమార్, సంతోష్ కుమార్ పూదరి, అడ్వయిజర్ గోవింద్ నాయక్, టీడబ్ల్యూజేఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య తదితరులున్నారు. అనంతరం వారు హైదరాబాద్ జిల్లా విద్యాధికారి (డీఈఓ) యాదయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు.

# ఆలేరు రైల్వే ఓవర్ బ్రిడ్జి పై ప్రమాదాలు....

**ప్రజల ప్రాణాలు పోతున్నా పట్టించుకోని ప్రభుత్వ అధికారులు....**

**ఎంఏ ఇక్బాల్ సిపిఎం జిల్లా నాయకులు**

**బ్రిడ్జి పై రోడ్డు ప్రమాదంలో మరణించిన ఎర్ర ఉదయ్, సుంకరి శ్రీనాథ్....**

**మృతులకు నివాళులు అర్పించిన సిపిఎం ఆలేరు పట్టణ శాఖ....**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** మంగళవారం రోజున ఆలేరు పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జి పై ప్రమాదాలు జరిగి ఈ మధ్యకాలంలో ప్రాణాలు కోల్పోయిన ఎర్ర ఉదయ్, సుంకరి శ్రీనాథ్ లకు బ్రిడ్జి పై ప్రమాద స్థలిలో సిపిఎం ఆలేరు పట్టణ శాఖ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు ఎంఏ ఇక్బాల్ మాట్లాడుతూ.... ఆలేరు పట్టణంలో మున్సిపల్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి పై ఇప్పటివరకు అనేక ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రజలు వికలాంగులుగా మారారని అనేక మంది ప్రాణాలు కోల్పోయారని కానీ ఇప్పటివరకు ఆర్ అండ్ బి అధికారులు కానీ మున్సిపల్ అధికారులు కానీ స్పందించలేదని ప్రజల ప్రాణాలంటే ప్రభుత్వ అధికారులకు లెక్క లేకుండా అయిపోయిందని రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయి కుటుంబాలు రోడ్డు మీద పడుతున్న మాకెందుకు అనే చందంగా అధికారులు తీరు ఉందని దీనినీ సిపిఎం పార్టీ తరుపున తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి పై ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని అదేవిధంగా మంతపురి రోడ్డు నుండి బ్రిడ్జి ఎక్కుతున్న సమయంలో బ్రిడ్జ్ ఇరువైపుల ప్రహరీ గోడ దగ్గరగా ఉందని ప్రహరీ గోడ ఎత్తు గా ఉండడం వలన బ్రిడ్జిపై నుండి వస్తున్నటువంటి ద్విచక్ర వాహనాలు కార్లు మెయిన్ రెడ్ పై నుంచి వస్తున్న వాహనాలకు కనిపించకుండా ఉంటున్నాయని దీనివల్ల అధికంగా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. మంతపురి రోడ్డు నుండి బ్రిడ్జి ఎక్కే ప్రహరీ గోడ వైపున కబ్జాలు జరుగుతున్నాయని కబ్జాలను తొలగించి ప్రహరీ గోడల ఎత్తును తగ్గించే విధంగా ఏర్పాటు చేయాలని ప్రహరీ గోడకు ఇరువైపులా 10 ఫీట్ల వెడల్పుతో స్థలం ఉన్నప్పటికీ లింక్ రోడ్డు గా వెడల్పు చేయలేదని దీనివల్ల బ్రిడ్జి ఎక్కే సమయంలో వాహనాలు అతి దగ్గరగా వస్తున్నాయని పై నుండి వాహనాలు వస్తున్న సంగతి స్పష్టంగా కనిపించే విధంగా చూడాలని అన్నారు రేడియం డివైడర్లను ఏర్పాటు బటర్ఫ్లై లైట్లు ఏర్పాటు చేసి ప్రమాద సూచికలను కనిపించే విధంగా ఇరువైపులా ఏర్పాటు చేయాలని వారి డిమాండ్ చేశారు ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించకుంటే రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబాలను జిల్లా కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి స్థానికంగా ఉన్నటువంటి ఆర్ అండ్ బి మరియు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు మొరిగాడి రమేష్, వడ్డెమాను బాలరాజు, మొరిగాడి అజయ్ కుమార్, రాజేష్, కాసుల నరేష్, డివైఎఫ్ఐ నాయకులు మాదాని నవీన్, యాసారపు ప్రసాద్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు మద్దెల సాయినాథ్, మోరీగాడి అంజయ్య, ఘనగాని రాజు, ఎండి మతిన్, ఎండి ఖలీల్, కటకం సుదర్శన్, గొడుగు దాసు, కొరుటూరి ఉపేందర్, ఎగ్గిడి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# రఘునాథపురంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ప్రచారం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం రఘునాథపురం గ్రామంలో మంగళవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు.మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటను నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా స్థానిక గ్రామ సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి బడిబాట ప్రచారం నిర్వహించారు. అనంతరం ఉపాధి హామి పథకం పనిచేసే చోట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్ మాట్లాడుతూ.... ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని, అనుభవజ్ఞులైన, నిష్ణాతులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన చెప్పబడుతుందని, మన పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుండి ప్రీ ప్రైమరీ తరగతులు కూడా ప్రారంభిస్తున్నారని అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనము, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్, బ్యాగులు, షూస్ అందజేస్తారని అన్నారు. ప్రభుత్వం ఇన్ని వసతులు కల్పిస్తున్నప్పటికీ పిల్లలను ప్రైవేటుకి పంపించి డబ్బులు వృధా చేసుకోవద్దని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగ వెంకట నర్సమ్మ మాట్లాడుతూ.... పాఠశాలలో విద్య నేర్పే ఉపాధ్యాయులందరూ చిత్తశుద్ధితో నిబద్ధతతో పనిచేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామని అన్నారు. పాఠశాలలో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించినందున మంజూరైన ఒక టీచర్, ఒక ఆయా పోస్ట్ కు అర్హత కలిగిన వారు సంబంధిత ధ్రువపత్రాలతో ఈ నెల 16 లోపు దరఖాస్తు చేసుకోవాలని సర్పంచ్ కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సోమ సత్తి రెడ్డి, జూకంటి కరుణాకర్, చింతకింది శ్రీనివాస్, కీర్తి సరిత, ఇండ్ల రామచందర్, అంగన్వాడీ టీచర్ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పీసీసీ డెలిగేట్ తంగళ్లపల్లి రవికుమార్ జన్మదిన వేడుకలు

**నిస్వార్థంగా పార్టీ కోసం పనిచేస్తూ...**

**ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే ప్రజా నాయకుడు తంగళ్లపల్లి రవికుమార్**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** పీసీసీ డెలిగేట్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తంగళ్లపల్లి రవికుమార్ జన్మదిన వేడుకలు సోమవారం భువనగిరి పట్టణంలో అత్యంత ఘనంగా జరిగాయి. బీసీ సంఘాలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, బీసీ సంఘాల ప్రతినిధులు తంగళ్లపల్లి రవికుమార్ ని శాలువాలతో ఘనంగా సత్కరించి, పూలమాలలు వేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బీసీ నాయకులు, కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... నిస్వార్థంగా పార్టీ కోసం పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే ప్రజా నాయకుడు తంగళ్లపల్లి రవికుమార్ అని కొనియాడారు. పేదల సంక్షేమం, బీసీల అభ్యున్నతి, కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం రవన్న మాట్లాడుతు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హీరే కార్ శ్రీను, కొత్త నరసింహ స్వామి, పిట్టాల బాలరాజ్, నక్కల ఆదినారాయణ, బట్టు రాంచద్రయ్య, కూర శివకుమార్, సిరికొండా శివకుమార్, జిన్నా మల్లేష్, సబ్బాకర్ వెంకటేష్, మెరుగు శివకుమార్, డాకూరి ప్రకాష్, రవి, బీసీ సంఘాల జిల్లా, మండల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీనగర్ పంచాయతీలో అనుమతులు లేని అక్రమ కట్టడాలు.!

**సరైన పత్రాలు లేకుండా ఏజెన్సీలో బహుళ అంతస్తుల నిర్మాణాలు.!**

**అంతస్తులు కడుతున్న పట్టించుకోని పంచాయతీ మండల్ అధికారులు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవి పల్లి మండలం శ్రీనగర్ కాలనీ పంచాయతీ పరిసరాల్లోని గిరిజన ప్రాంతాలు అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారుతున్నాయి. గిరిజనుల హక్కులను రక్షించాల్సిన 1/70 చట్టం, ఐటిడిఏ నిబంధనలు ఇక్కడ కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. కళ్ళముందే భారీ బహుళ అంతస్తుల భవనాలు వెలుస్తున్నా, ఎమ్మార్వో ఆఫీస్ కి దగ్గరలో బహుళ అంతస్తులు కడుతున్న నిద్రమత్తు వీడని అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక భారీ స్థాయిలో అవినీతి హస్తంఉందనే



విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులు భూములు కొనడం అమ్మడం భారీ కట్టడాలు చేపట్టడంపై కఠినమైన నిషేధాలు ఉన్నాయి. కానీ, కొందరు బడా వ్యాపారస్తులు గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, బినామీ పేర్లతో భూములను ఆక్రమించి కోట్లాది రూపాయల విలువైన వాణిజ్య సముదాయాలను, అపార్ట్మెంట్లను నిర్మిస్తున్నారు. కేవలం పైస్థాయి ఒత్తిళ్లతోనే పంచాయతీ రాజ్ ఐటిడిఏ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. అక్రమ కట్టడాలకు నోటీసులు ఇవ్వాల్సింది పోయి, వాటికి మౌలిక వసతులు కల్పించడంలో చూపిస్తున్న ఉత్సాహం వెనుక ఉన్న మతలబు ఏమిటని గిరిజన సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.మరోవైపు, ఎన్నికల సమయంలో గిరిజన హక్కుల గురించి గొంతు చించుకునే ప్రజాప్రతినిధులు, ఈ అక్రమ నిర్మాణాల విషయంలో మౌనం వహించడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనంగా నిలుస్తోంది. వీరి అండదండలు లేనిదే ఇంతటి భారీ నిర్మాణాలు సాధ్యం కాదన్నది బహిరంగ



రహస్యం, నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఈ భవనాల వల్ల డ్రైనేజీ వ్యవస్థ చిన్నాభిన్నం అవుతోంది. భవిష్యత్తులో వరదలు సంభవిస్తే ఈ ప్రాంతం జలమయం అయ్యే ప్రమాదం ఉంది. గిరిజనుల భూములను, వారి సంస్కృతిని కాపాడాల్సిన చట్టాలు ఇక్కడ తుంగలో తొక్కబడుతున్నాయి. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక విచారణా కమిటీని ఏర్పాటు చేసి, లక్ష్మీదేవి పల్లి మండలం శ్రీనగర్ కాలనీలో లక్ష్మి దేవి పల్లి ఏజెన్సీ పరిధిలో గత ఐదేళ్లలో నిర్మించిన అన్ని బహుళ అంతస్తుల భవనాల అనుమతులను తనిఖీ చేయాలి. అక్రమంగా నిర్మించిన వాటిని తక్షణమే కూల్చివేయడమే కాకుండా, సహకరించిన అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలనీ కోరుతున్న ప్రజలు

# జూన్ 20న పదవ తరగతి ప్రతిభావంతులకు పురస్కారాల పంపిణీ

**500 మంది విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ.**

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09 :**
ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా ఈ నెల 20వ తేదీన సైకిల్లు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.మంగళవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని క్యాంపు కార్యాలయం లో నియోజకవర్గ పరిధిలోని ఆయా మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో మానసిక స్థైర్యం పెంపొందించేందుకు వ్యక్తిత్వ వికాస నిపుణులతో శిక్షణ తరగతులు నిర్వహించడం తోపాటు.. పరీక్ష సామాగ్రి సైతం అందించడం జరుగుతోందని తెలిపారు. అదే విధంగా.. ఫలితాల్లో అత్యుత్తమ మార్పులు సాధించిన విద్యార్థులను సైతం ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ప్రతి సంవత్సరం నగదు పురస్కారాలు పంపిణీ చేస్తున్నమని తెలిపారు. ఈ సంవత్సరం వినూత్నంగా సైకిళ్ళు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విద్యార్థినీ విద్యార్థులకు పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు



పటాన్చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పటాన్చెరు మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# ఇస్నాపూర్ మున్సిపాలిటీ కి ప్రత్యేక నిధులు కేటాయించండి : నీలం మధు ముదిరాజ్

**దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపించండి**

**మంత్రి వివేక్ కు ఘన స్వాగతం పలికి వినతి పత్రం ఇచ్చిన ఇస్నాపూర్ మున్సిపల్ కౌన్సిలర్లు...**

**పటాన్చెరు, హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09 :**
పటాన్చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపాలిటీ ని ప్రత్యేకంగా పరిగణించి నిధులు కేటాయించాలి అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు.మంగళవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగిన సమీక్ష సమావేశానికి హాజరైన జిల్లా ఇంచార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి గారిని ఇస్నాపూర్ చౌరస్తాలో కలసి ఘనస్వాగతం పలికి నిధులు, పలు సమస్యలపై ఇస్నాపూర్ మున్సిపల్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చిన నీలం.ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ ఇస్నాపూర్ మున్సిపాలిటీ చిట్కుల్ పరిధిలో గల 329 కాలనీ, ఇస్నాపూర్ ఇందిరమ్మ కాలనీ లో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగిందని ఆ కాలనీలో అంతర్గత రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, కరెంట్ పోల్స్, త్రాగునీరు, ఇంటి నెంబర్లు మరియు కరెంట్ మీటర్లు, వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు, అలాగే నేషనల్ హైవే నుండి లక్డారం- బ్యాతోల్ - రుద్రారం - ఏర్ధనూర్ వరకు రోడ్డు, ఇరు వైపులా ఐమాక్స్ లైట్స్ ఏర్పాటు చేయాలని మరియు వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించిన 15 కోట్ల నిధుల పనులు ఇప్పటికే ప్రారంభం అయినట్టు మంత్రి కి ఆయన వివరించారు అలాగే మరికొన్ని నిధులు కేటాయించాలని మంత్రిని కోరినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు నారాయణదాసు, మన్నే రాఘవేందర్, వెంకటేష్ నాయక్,



అల్లం గారి నర్సింహారెడ్డి, సంగన్న గారి గోపాల్, మంజలి దస్తగిరి, మణికంఠ, నాయకులు వల్లపు వెంకటేష్, మురళి, మహేష్, అనిల్, ప్రవీణ్, కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన వీరుడు కొమరం భీమ్ విగ్రహావిష్కరణ

**పాల్గొన్న వందలాది మంది ఆదివాసీలు**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09,భద్రాద్రి కొత్తగూడెం:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని కేశపురం గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన గిరిజన వీరుడు కొమరం భీమ్ విగ్రహావిష్కరణ కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గ్రామానికి చేరుకోగా ఆదివాసీలు, గ్రామస్థులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించి ఆహ్వానించారు. ఎమ్మెల్యే తెల్లం. వెంకట్రావు కొమురం భీమ్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ సేవలను స్మరించుకుంటూ ఆయన గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. జల్-జంగల్-జమీన్ నినాదంతో గిరిజనుల అస్తిత్వ పరిరక్షణ కోసం చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోయిందని, అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కొమరం భీమ్ ఆశయాలు నేటి తరానికి మార్గదర్శకాలని, గిరిజనుల అభ్యున్నతి, సమాన హక్కులు, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన త్యాగాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తినిస్తాయని, మహనీయుల చరిత్రను భావితరాలకు పరిచయం చేయడంలో విగ్రహాలు, స్మారక చిహ్నాలు ముఖ్య పాత్ర పోషిస్తాయని చెప్పారు. యువత చరిత్రను తెలుసుకొని సమాజ సేవలో ముందుండాలని గొప్ప నాయకుల ఆశయ సాధనకు కృషి చేయాలని,రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో గిరిజనులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు కృషి




జరుగుతోందన్నారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కొమరం భీమ్ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, గిరిజన సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో నరమేధం.. సైన్యం కాల్పుల్లో 30 మంది మృతి



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09 :**
పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లో ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. ఆ ప్రాంతంలో ఆర్థిక, రాజకీయ హక్కుల సాధన కోసం పోరాడుతున్న 'జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ'పై అక్కడి ప్రభుత్వం నిషేధం విధించడంతో తీవ్ర ఘర్షణలు చెలరేగాయి. ఈ క్రమంలో నిరసనకారులకు, భద్రతా దళాలకు మధ్య జరిగిన భీకర ఘర్షణల్లో 30 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. దాదాపు 200 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు.

**పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం..**
అంతకుముందు జరిగిన పోలీసు కాల్పుల్లో మరణించిన తమ గ్రూప్ సభ్యుని మృతదేహాన్ని ఉంచిన ఓ ఆసుపత్రి మార్చురీ వెలుపల జాయింట్ అవామీ యాక్షన్ కమిటీకి చెందిన నిరసనకారులు భారీ సంఖ్యలో గుమిగూడారు. అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో రంగంలోకి దిగిన భద్రతా దళాలు వారిని చెల్లాచెదురు చేయడానికి ప్రయత్నించాయి. ఈ తరుణంలో ఆగ్రహించిన నిరసనకారులు ఆటోమేటిక్ రైఫిళ్లు, పెట్రోల్ బాంబులు, ఇతర ఆయుధాలతో భద్రతా దళాలనే లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడ్డారని పోలీసులు వెల్లడించారు. ఈ ఘర్షణల నేపథ్యంలో శాంతిభద్రతలను అదుపులోకి తెచ్చేందుకు చట్ట అమలు సంస్థలు జరిపిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు నిరసనకారులు మరణించారని పూంచ్ సెక్టార్ రీజినల్ కమిషనర్ సర్దార్ వహీద్ ఖాన్ వెల్లడించారు.ఈ ప్రాంతంలో జరగబోయే శాసనసభ ఎన్నికల నిర్ణయమే ఈ తాజా హింసాకాండకు ప్రధాన కారణమని తెలుస్తోంది. పీఓకే అసెంబ్లీలో మొత్తం 45 స్థానాలకు గాను జులై 27న జరగనున్న ఎన్నికల్లో శరణార్థుల కోసం 12 స్థానాలను రిజర్వ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ ఈ సమ్మెకు మరియు నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ రిజర్వేషన్ నిర్ణయం పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్న స్థానిక ప్రజలు రోడ్లపైకి రావడంతో, అది కాస్తా పరస్పర కాల్పులు, హింసాత్మక ఘర్షణలకు దారితీసి భారీగా ప్రాణనష్టాన్ని మిగిల్చింది.

**ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం..**
పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ నేతృత్వంలో ఈ అణచివేత చర్యలు మరింత తీవ్రమయ్యాయి. జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ ఉద్యమాన్ని ఎ పెద్ద రాజకీయ సవాలుగా భావిస్తున్న సైనిక యంత్రాంగం, రాబోయే ఎన్నికల కంటే ముందే ఇక్కడి తిరుగుబాటు స్వరాలను నొక్కేయాలని కఠిన వైఖరిని అవలంబిస్తోంది. గత 2024, 2025 సంవత్సరాల్లో జరిగిన ఘర్షణల తరహాలోనే ప్రస్తుత అణచివేత కూడా సాగుతోందని అంతర్జాతీయ హక్కుల సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నరమేధంపై స్వతంత్ర దర్యాప్తు జరపాలని అంతర్జాతీయ సమాజం డిమాండ్ చేస్తోంది.

# పీఓకేలో కాశ్మీరీల ఊచకోతపై స్పందించిన భారత్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09, సెంట్రల్ డెస్క్:**
పాక్ ఆక్రమిత కాశ్మీర్ లోని రావల్కోట్‌లో నిరసనకారులపై జరిగిన హింసపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. పీఓకేలో పోలీసుల క్రూరత్వం తీవ్రంగా ఉన్నట్టు నివేదికలు చెబుతున్నాయని అన్నారు. పాక్ చేసిన దుశ్చర్యలకు, దురాగతాలకు అంతర్జాతీయ సమాజం ఆ దేశాన్ని జవాబుదారీగా నిలబెడుతుందని ఆశిస్తున్నామని అన్నారు. పీఓకేలో జరిగిన మానవ హక్కుల ఉల్లంఘన నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి పాకిస్థాన్ తప్పుడు వార్తలు, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తోందని ఆరోపించారు. పాకిస్థాన్ నుండి నకిలీ వార్తలు, వీడియోలు ఒకే రీతిలో వెలుబడుతున్నాయని.. దానిని భారత్ గమనించిందని అన్నారు.ఇది తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి చేస్తున్న ఒక నిస్సహాయ ప్రయత్నం అని అభివర్ణించారు. ఇదిలా ఉంటే పీవోకేలో జాయింట్ అవామీ యాక్షన్ కమిటీకి చెందిన కార్యకర్తలు తమ కమిటీని ప్రభుత్వం నిషేదించడంపై ఆందోళనలు చేపట్టారు. ఈ క్రమంలో నిరసనకారులు, భద్రతా దళాల మధ్య ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు నిరసనకారులపై దాడులు చేయడంతో 30 మంది మరణించారు. దాదాపు 200మంది గాయపడ్డారు. అయితే నిరసన కారులు తమపై గెరిల్లా తరహా దాడులు చేయడం వల్లే తాము దాడి తుపాకులకు పని చెప్పాల్సి వచ్చిందని పోలీసులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనతో పీఓకే మరోసారి హాట్ టాపిక్ గా మారింది.

# దేశ ద్రోహులకు భారతదేశం ధర్మశాల కాదు.. యోగి ఆదిత్యనాథ్




లఖ్‌నవూ: దేశ సంస్కృతి, సంప్రదాయాల పట్ల విశ్వాసం లేని వారికి భారతదేశం ఎంతమాత్రం ధర్మశాల కాదని ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ అన్నారు. లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. లఖ్?నవూలో మంగళవారంనాడు జరిగిన శ్రీరామకథా మహోత్సవం ముగింపు వేడుకలో ఆయన మాట్లాడుతూ, శ్రీరాముని ఆదర్శాలు యావద్దేశాన్ని ఏకం చేస్తున్నాయని చెప్పారు.'భారతదేశం ఎంతమాత్రం ధర్మశాల కాదు. దేశ సంస్కృతి, వారసత్వం, విలువలను గౌరవించే వాళ్లు మాత్రమే ఇక్కడ గౌరవప్రదంగా జీవించవచ్చు. భారతదేశ స్ఫూర్తి, సంప్రదాయాలను అంగీకరించని వాళ్లకి ఇక్కడ స్థానం లేదు' అని యోగి ఆదిత్యనాథ్ అన్నారు. రామాయణ కాలానికి, నవీన భారతానికి మధ్య సారూప్యాన్ని వివరిస్తూ, దుష్టశక్తులు అధికారంలో ఉన్నప్పుడల్లా రాక్షసరాజు రావణాసురిడి కాలంలో ఏవిధంగా దుష్టశిక్షణ జరిగిందో అదే పునరావృతమవుతుందని అన్నారు.దేశంలోని జనాభా మార్పు కోసం జరుగుతున్న కుట్రలో భాగమే 'లవ్ జిహాద్' అని యోగి ఆదిత్యనాథ్ పేర్కొన్నారు. రామాయణ కాలంలో కూడా ఖాళీగా ఉన్న భూములను మారీచుడు, ఖరదూషణాది రాక్షసులు దురాక్రమణ చేసేవారని, ల్యాండ్ జిహాద్‌కు పాల్పడేవారని అన్నారు. ప్రతి యుగంలోనే దుష్టశక్తులు ఉంటాయని, అయితే సత్యం, మతం పరిరక్షణకు శ్రీరాముడు ఏవిధంగా పాటుపడ్డారో అందరూ తెలుసుకుని కర్తవ్యబద్ధులుకావాలని, అంతా ఐక్యంగా నిలవాలని అన్నారు.

# ఇరాన్ యుద్ధం ప్రభావం.. కేంద్రానికి రూ.1.23 లక్షల కోట్లు ఖర్చు..




ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. చమురు సరఫరాకు ఆటంకం ఏర్పడడంతో ముడి చమురు ధరలు భగ్గుమన్నాయి. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగినా దేశీయంగా మాత్రం పెట్రోల్, డీజిల్ ధరలు పెరగలేదు. దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలను అదుపులో ఉంచేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ ఆర్థిక భారం మోసినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలకు మద్దతుగా కేంద్రం రూ.1.23 లక్షల కోట్లు అందించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత 78 రోజుల పాటు పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల భారం వినియోగదారులపై పడకుండా ఉంచేందుకు కేంద్రం ఈ ఖర్చును భరించింది. ప్రపంచ మార్కెట్లో చమురు ధరలు పెరిగినప్పటికీ, దేశీయ రిటైల్ ధరలను వెంటనే పెంచకుండా ప్రభుత్వం జోక్యం చేసుకుంది.భారత్ తన చమురు అవసరాల్లో దాదాపు 90 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది . హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఉద్రిక్తతలు, సరఫరా అంతరాయాలు, ముడి చమురు ధరల పెరుగుదల దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి. కాగా, ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను దశలవారీగా పెంచారు.

# అత్యంత భక్తి శ్రద్ధలతో అధిక మాస శివపార్వతుల పూజలు







**భక్తి శ్రద్ధలతో అధికమాస శివపార్వతులకు అన్న పూజాలు....**

**సామూహిక కుంకుమార్చన మహోత్సవం....**

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరములో అధికమాసం పురస్కరించుకొని సోమవారం రాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షులు నంగునూరు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శాశ్వత బియ్యం దాత పుల్లూరు ఉపేందర్ సూర్యకళ దంపతులు, దాతల సహకారంతో జరిగాయి. ఆలయ అర్చక స్వాములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ వైదిక కార్యక్రమాలు అత్యంత భక్తి శ్రద్ధలతో సాంప్రదాయంగా ఘనంగా నిర్వహించారు. స్వస్తిశ్రీ పరాభవ నామ సంవత్సర అధిక జ్యేష్ట బహుళ అష్టమి రోజున రాత్రి మూడు గంటలకు పైగా రామకృష్ణ సాయి మందిరంలో అధిక జేష్ట మాసము పురస్కరించుకొని విశేష పూజా కార్యక్రమములు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చల్లూరు గ్రామ సర్పంచి భీమగాని రూప బాలనర్సయ్య గౌడ్ పుణ్య దంపతులు, నాల్ల శేఖర్ పద్మ పుణ్య దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గణపతి పూజ లఘున్యాస పూర్వక రుద్రాభిషేకములు అన్న పూజ , అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలు మంగళ హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు భక్తుల జయ జయ ద్వానాల మధ్య జరిగాయి. ఈ సందర్భంగా వైదిక బ్రాహ్మణోత్తములు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద శర్మ భక్తులను ఉద్దేశించి మాట్లాడారు అధికస్య అధికం ఫలం అని, అధికమాసంలో చేసే ఏ చిన్న పూజా కార్యక్రమం అయినా అధిక ఫలం కలుగజేస్తుందని, అధికమాసంలో చేసే శివ పార్వతుల పూజ విశేష ఫలితాలను ఇస్తుందని వివరించారు. భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి స్వామివారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ వైదిక నిర్వహణలో కార్యక్రమం అద్భుతంగా జరగడం పట్ల పాల్గొన్న భక్తజనులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సామూహిక అల్పాహార కార్యక్రమం జరిగింది. కార్యక్రమం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తి భావంతో నిండిపోయింది.

# ప్రీ ప్రైమరి ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు ఆహ్వానం....!

- **అర్హతగల అభ్యర్థులు స్థానిక ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి**
- **కోహిర్ మండల విద్యాధికారి ఎండీ. జాకిర్ హుస్సేన్**

**జహీరాబాద్, జూన్,09 హైదరాబాద్ పల్స్ న్యూస్ :**
కోహిర్ మండలంలోని వివిధ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించుటకు రాష్ట్ర విద్యాశాఖ అనుమతించినందున ప్రతి ప్రీ ప్రైమరీ విభాగానికి రెండు పోస్టులు మంజూరు చేయబడ్డాయని కోహిర్ మండల విద్యాధికారి ఎండీ. జాకిర్ హుస్సేన్ అన్నారు.ప్రతి పాఠశాలకు ఒక "పూర్వ ప్రాథమిక బోధకులు" ప్రీ ప్రైమరీ ఇంస్ట్రుక్టర్ ప్రతి పాఠశాలకు ఒక ఆయా ప్రీ ప్రైమరీ ఇన్స్ట్రక్టర్ పోస్టుకు కనీస విద్యా అర్హత ఇంటర్మీడియట్ లేదా బాల్య విద్య లేదా ప్రాథమిక బోధనలో అర్హతలు ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని భోదనలో పూర్వ అనుభవం గలవారికి ప్రాధాన్యత ఉంటుందని,ఆయా పోస్టుకు కనీస విద్యా అర్హత 7వ తరగతి ఉత్తీర్ణత. ఎంపికలో వితంతువు అభర్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని అభ్యర్థులు అదే గ్రామ పంచాయతీ,అదే మండలానికి చెందినవారై ఉండాలని సంబంధిత నోటిఫికేషన్ తేదీ నాటికి అభ్యర్థులు 18 నుండి 44 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం (రాజ/రా/దీజ×జుబొ వారికి 5 సంవత్సరాలు, మాజీ సైనికులు 3 సంవత్సరాలు, వికలాంగులకు 10, సంవత్సరాలు సడలింపు ఉంటుందన్నారు.నియామకాలు పూర్తిగా తాత్కాలికమేనని ఎంపికైన అభ్యర్థులకు గౌరవ వేతనం ప్రతి విద్యా సంవత్సరానికి 10 నెలలు మాత్రమే చెల్లించబడుతుంది. బోధకులకు నెలకు రూ.8,000 గౌరవ వేతనం ఆయాకు నెలకు రూ.6,000 గౌరవ వేతనం ఉంటుందని మండల విద్యాధికారి ఎండీ. జాకిర్ హుస్సేన్ అన్నారు .మండల స్థాయిలో ధరఖాస్తులను స్వీకరించడానికి ప్రారంభ తేదీ



9.6.2026,మండల ఎంపిక కమిటీ ద్వారా ధరఖాస్తుల పరిశీలన 13.6.2026, మండల ఎంపిక కమిటీ ద్వారా అభ్యర్థుల ఎంపిక ఉంటుందన్నారు. 14.6.2026 మండల ఎంపికకమిటీ ద్వారా ఎంపికైన అభ్యర్థులజాబితాను 15.6.2026,16.6.2026 అభ్యర్థులు సంబంధిత ఎంఈఓ కార్యాలయంలో పైన తెలిపిన తేదీల ప్రకారం ధరఖాస్తు సమర్పించగలరని అన్నారు. ఖాళీల వివరములకై సంబంధిత మండల విద్యాధికారిని సంప్రదించాలని అన్నారు

# అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించిన ఎంపీ చామల.....

**భువనగిరి పార్లమెంట్ పరిధిలోని ప్రధాన సమస్యలపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి సమీక్ష....**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09,యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించబడింది. ఈ సమావేశానికి భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలు కీలకమైన మరియు దీర్ఘకాలిక సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా రైల్వే లైన్ల విస్తరణ-సమస్యలు, నేషనల్ హైవే (జాతీయ రహదారులు) పనులు, ఇరిగేషన్ (సాగునీటి ప్రాజెక్టులు), మరియు బీబీనగర్ ఎయిమ్స్ ఆసుపత్రి అభివృద్ధి, వైద్య సేవల మెరుగుదల వంటి ప్రధానాంశాలపై ఎంపీ ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఈ పనులన్నింటినీ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హాజరైన ప్రముఖులు ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ప్రజాప్రతినిధులు మరియు ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నావారు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ రావు, వీరితో పాటు జిల్లాలోని పలు మున్సిపాలిటీల చైర్మన్లు, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని జిల్లా అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికలపై చర్చించారు.



# గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసిన తుర్కపల్లి పోలీసులు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, జూన్ 09, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి:** మంగళవారం నాడు ముగ్గురు వ్యక్తులు రాంపూర్ గ్రామ శివారులో కాలువ ప్రక్కన అక్రమంగా గంజాయిని కలిగి ఉన్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు, తుర్కపల్లి ఎస్.ఐ, తన సిబ్బందితో కలిసి రాంపూర్ గ్రామ శివారులో కాలువ ప్రక్కన ముగ్గురు అనుమనితులని అదుపు లోకి తీసుకొని విచారించగా, వారి వద్ద సుమారు 250 గ్రాముల గంజాయి దొరికింది. సదరు నిందుతులు అట్టి గంజాయిని కర్కపట్ల నుండి కొనగోలు చేసి తుర్కపల్లికి తరలించి అమ్ముతున్నారు.

**నిందితుల వివరాలు:**
గిరిమిల్ల సాయి మధు, పసుల లింగ స్వామి, సయ్యద్ జావీద్.


**స్వాధీనం చేసుకున్నవి:**



1. 250 గ్రాముల గంజాయి. 2. పల్సర్ మోటార్ వెహికల్. 3. (3) మొబైలు ఫోన్లు.ఈ సందర్భంగా తుర్కపల్లి ఎస్.ఐ మాట్లాడుతూ... గంజాయి తాగేవారి పట్ల, అమ్మే వారిపట్ల



కఠినంగా వ్యవహరిస్తాము, అని యువత గంజాయి కి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కేసు, అక్షాంశ్ యాదవ్ ఐపీఎస్,




ఎస్పి యాదాద్రి భువనగిరి జోన్, పి. శ్రీనివాస్ నాయుడు, డిఎస్పీ యాదాద్రి, ఎం. శంకర్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, యాదగిరిగుట్ట రూరల్ పర్యవేక్షణలో, మహమ్మద్ తఖియుద్దీన్, యస్ఐ, తుర్కపల్లి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్ పల్స్
epaper.hyderabadpulsenews.in
GENERAL NEWS
బుధవారం
10-06-2025


# "వెన్నతో" ఇలా చేస్తే సూపర్ రిజల్ట్!

పాలకు సంబంధించిన ఆహారపదార్థాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అలాంటి వాటిల్లో "వెన్న(బటర్)" కూడా ఒకటి. వివిధ రకాల ఆహార పదార్థాలకు రుచిని అందించడానికి దీన్ని ఎక్కువగా వాడుతుంటాం. కానీ, మీకు తెలుసా? కేవలం వంటల్లో ఉపయోగించడమే కాదు మన నిత్య జీవితంలో వెన్న వల్ల ఎన్నో రకాల ఉపయోగాలు ఉన్నాయని చెబుతున్నారు నిపుణులు. ప్లాస్టిక్? డబ్బాలపై మరకల నుంచి గిన్నెల నీచు వాసన పోగొట్టడం వరకు బటర్?తో బోలెడు ఉపయోగాలున్నాయంటున్నారు. మరి, అవేంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం.ప్లాస్టిక్ వస్తువులు లేదా డబ్బాలపై ఏర్పడిన మరకలు క్లీన్ చేయాలంటే ఎవరికైనా కాస్త కష్టంగానే అనిపిస్తుంది. అలాంటి సందర్భాల్లో వెన్నను ఉపయోగిస్తే వాటిపై ఉన్న మరకలను చాలా ఈజీగా తొలగించవచ్చంటున్నారు నిపుణులు. ఇందుకోసం మీరు చేయాల్సిన పని ఏంటంటే, మరకలు ఏర్పడిన చోట కొద్దిగా బటర్ రాసి కొద్దిసేపు అలాగే ఉంచేయాలి. ఆ తర్వాత ఏదైనా శుభ్రమైన వస్త్రంతో తుడిచేస్తే చాలు మరకలు సులభంగా వదిలిపోయి నీట్‌గా కనిపిస్తాయంటున్నారు.మన ఇళ్లలో చాలా సందర్భాల్లో డోర్ క్లోజ్ చేస్తున్నప్పుడు, ఓపెన్ చేస్తున్నప్పుడు కిర్?ర్ మనే సౌండ్ వస్తూ ఉంటుంది. ఆ శబ్దాన్ని పోగొట్టడానికి వెన్న చాలా బాగా ఉపయోగపడుతుందంటున్నారు. ఇందుకోసం కొద్దిగా వెన్న తీసుకుని మడత బందులకు రాస్తే శబ్దం రాకుండా ఉంటుందని, తలుపు కూడా చక్కగా సెట్ అవుతుందని చెబుతున్నారు నిపుణులు.చేతులకు అంటుకున్న జిగురు(గ్లూ)ని వదలగొట్టడం ఇబ్బందిగా ఉంటుంది. అలాంటి సందర్భాల్లో హ్యాండ్స్ క్లీన్ చేసుకునే ముందు బటర్ రాసుకోవడం ద్వారా గ్లూని సులభంగా వదిలించుకోవచ్చని చెబుతున్నారు.కొన్నిసార్లు వేలికి ఉన్న ఉంగరాలు బిగుతుగా మారుతుంటాయి. ఎంత తీసినా రావు. అప్పుడు వేళ్లకు కాస్త బటర్ రాసి తీస్తే ఉంగరాలు ఈజీగా వచ్చేస్తాయని చెబుతున్నారు.మనం కొన్నిసార్లు కర్రీ వండడానికి ఎక్కువ మొత్తంలో ఉల్లిపాయలు కట్ చేస్తుంటాం. అలాంటప్పుడు సగం కోసిన ఉల్లిపాయలు మిగిలిపోతుంటాయి. అలా కోసి ఆనియన్స్ పాడవకుండా ఉండాలంటే వాటిపై కొద్దిగా వెన్న రాయాలని.. ఇలా చేస్తే ఉల్లిపాయ వాడిపోదని, ఘాటు కోల్పోదంటున్నారు.చెక్క వస్తువులపై ఏర్పడిన నీటి మరకలు అందవిహీనంగా కనిపిస్తుంటాయి. అవి తొలగించడానికి రాత్రి టైమ్‌లో కాస్త బటర్ రాసి నెక్స్ట్ డే మార్నింగ్ క్లీన్ చేసుకుంటే సరిపోతుందని చెబుతున్నారు. వుడ్ ఫర్నిచర్‌ను మెరిసేలా చేయడానికి కూడా వెన్నను ఉపయోగించవచ్చని నిపుణులు చెబుతున్నారు.చర్మాన్ని మాయిశ్చరైజ్ చేయడానికి బటర్ సహాయపడుతుంది. ముఖ్యంగా శీతాకాలంలో స్కిన్ పొడిబారి ఎండిపోయినట్లు కనిపిస్తుంది. ఆ టైమ్‌లో కొద్దిగా వెన్నను చర్మం మీద రాసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుందంటున్నారు. స్కిన్ మృదువుగా మారుతుందని చెబుతున్నారు.చేపలు క్లీన్ చేసిన తర్వాత వాటిని ఉంచిన గిన్నెల నుంచి వచ్చే నీచు వాసన ఓ పట్టాన పోదు. అలాంటప్పుడు వాసన వచ్చే పాత్రలనుకాస్త వెన్నతో తోమాలి. ఆపై సబ్బు ఉపయోగించి గోరువెచ్చని వాటర్‌తో శుభ్రం చేయాలి. ఇలా చేస్తే పాత్రల నుంచి నీచు వాసన రాకుండా ఉండడమే కాకుండా, కొత్త వాటిలా కనిపిస్తాయంటున్నారు నిపుణులు.



# ఎప్పుడైనా "అఫ్ఘానిస్థాన్ చికెన్ కర్రీ" రుచి చూశారా?

## ఒక్కసారి తింటే మళ్లీ మళ్లీ కావాలంటారు!



సండే వస్తే చాలు చాలా మంది విందులోకి బిర్యానీయో, చికెన్ కర్రీయో లేనిదే భోజనం కానివ్వరు. ఇక నాన్‌వెజ్ లవర్స్ అయితే ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అయితే, ప్రతి సండే ఒకటే తరహాలో చికెన్ కర్రీ తిని బోర్ కొట్టిందా సరికొత్త టేస్ట్‌ను ఎంజాయ్ చేయాలనుకుంటున్నారా? అలాంటి వారికోసమే ఈ సూపర్ రెసిపీ. అదే, అఫ్ఘానిస్థాన్ స్టైల్‌లో అద్దిరిపోయే "చికెన్ కర్రీ".ఇది రెగ్యులర్‌గా చేసుకునే దానికన్నా మంచి రుచికరంగా ఉండి తిన్నా కొద్దీ తినాలనిపిస్తుంది. అలాగే, దీన్ని రెడీ చేసుకోవడానికి ఎక్కువ టైమ్ కూడా పట్టదు. ఇంట్లో వారు ఒక్కసారి రుచి చూశారంటే మళ్లీ మళ్లీ చేసిపెట్టమని అడుగుతారు! ఈ కర్రీ అన్నంలోకి మాత్రమే కాకుండా ఫ్రైడ్ రైస్, చపాతీ, రోటీ ఇలా దేనిలోకైనా భలే కమ్మగా ఉంటుంది. మరి, లేట్ చేయకుండా ఈ నయా స్టైల్ చికెన్ కర్రీని ఎలా చేసుకోవాలో ఇప్పుడు చూద్దాం.

**కావాల్సిన పదార్థాలు :**

కేజీ – చికెన్
ఒక కప్పు – పెరుగు
అర కప్పు – ఫ్రెష్ క్రీమ్
రుచికి సరిపడా – ఉప్పు
రెండు టేబుల్‌స్పూన్లు – అల్లంవెల్లుల్లి పేస్ట్
పది – బాదం
పదిహేను – జీడిపప్పులు
నాలుగైదు – పచ్చిమిర్చి
రెండు టేబుల్ స్పూన్లు – నిమ్మరసం
ఒకటిన్నర స్పూన్లు – మిరియాలపొడి
ఒక స్పూన్ – జీలకర్ర పొడి
అర స్పూన్ – గరంమసాలా
రెండు టేబుల్‌స్పూన్లు – కసూరీ మేతి
మూడు టేబుల్‌స్పూన్లు – వెన్న
రెండున్నర టేబుల్‌స్పూన్లు – నూనె

**తయారీ విధానం :**

ఈ కొత్తరకం చికెన్ కర్రీ కోసం ముందుగా ఒక గిన్నెలో వేడినీళ్లు తీసుకుని అందులో బాదం, జీడిపప్పులను వేసి పావుగంట పాటు నానబెట్టాలి.ఆలోపు చికెన్‌ను శుభ్రంగా కడిగి జల్లిగిన్నెలో వేసి పక్కనుంచాలి. అలాగే, జీలకర్ర పొడి, మిరియాలపొడిని సిద్ధం చేసి పెట్టుకోవాలి.ఇప్పుడు మిక్సీ జార్ తీసుకుని అందులో పచ్చిమిర్చి, పెరుగు, ఫ్రెష్ క్రీమ్, అల్లంవెల్లుల్లి పేస్ట్, గరంమసాలా, రుచికి తగినంత ఉప్పు, నిమ్మరసం వేసుకోవాలి.అలాగే, నానబెట్టిన బాదం, జీడిపప్పులను కూడా వేసి మెత్తని పేస్ట్‌లా గ్రైండ్ చేసుకోవాలి.నెక్స్ట్ శుభ్రంగా కడిగి పెట్టుకున్న చికెన్‌లో గ్రైండ్ చేసిన జీడిపప్పులు–బాదం మిశ్రమం, ముందుగా రెడీ చేసుకున్న జీలకర్రపొడి, మిరియాల పొడి వేసుకుని అవన్నీ చికెన్ ముక్కలకు మంచిగా పట్టేలా బాగా కలుపుకోవాలి.తర్వాత ఆ మిశ్రమాన్ని ఫ్రిడ్జ్‌లో రెండు గంటలపాటు ఉంచాలి. మీకు ఒకవేళ టైమ్ ఉంటే రాత్రంతా ఉంచితే రుచి ఇంకా చాలా బాగుంటుంది.అనంతరం స్టవ్ మీద కర్రీకి సరిపోయే పాన్ లేదా కడాయిని ఉంచి తగినంత నూనె పోసి వేడి చేసుకోవాలి.ఆయిల్ హీట్ అయ్యాక మ్యారినేట్ చేసి ఫ్రిడ్జ్‌లో ఉంచిన చికెన్‌ను వేసి మీడియం ఫ్లేమ్‌లో మూతపెట్టి ఉడకనివ్వాలి.పది నిమిషాలకు చికెన్ నుంచి నీరు బయటకు వస్తుంది. అప్పుడు మంటను పెంచి ఒకసారి గరిటెతో కర్రీని కలియబెట్టాలి.తర్వాత మళ్లీ మంటను తగ్గించి చికెన్ బాగా మెత్తగా అయ్యే వరకూ ఉడికించుకోవాలి.అలా ఉడకడానికి 20 నుంచి 25 నిమిషాల వరకు సమయం పట్టొచ్చు.ఆవిధంగా చికెన్ ఉడికిందనుకున్నాక చివర్లో వెన్న యాడ్ చేసుకుని కలిపి మరో నిమిషం మగ్గనివ్వాలి.ఆ తర్వాత స్టవ్ ఆఫ్ చేసి దించేసి ఉల్లి స్లైసులు, నిమ్మ ముక్కలతో గార్నిష్ చేసుకుని సర్వ్ చేసుకుంటే చాలు.అంతే, సరికొత్త రుచితో నోరూరించే "అఫ్ఘానిస్థాన్ స్టైల్ చికెన్ కర్రీ" రెడీ అవుతుంది!మరి, నచ్చితే మీరూ ఎప్పుడూ చేసుకునే పద్ధతిలో కాకుండా ఓసారి ఇలా చికెన్ కూర చేసి చూడండి. ఇంటిల్లిపాదీ వావ్ సూపర్ టేస్ట్ అంటూ ఫిదా అవుతారు!

# "అటుకుల చక్కెర పొంగలి"

## ఈ కొలతల్లో ట్రై చేశారంటే కమ్మగా ఉంటుంది!



వ్రతాలు, పండుగలు, పూజల సమయాల్లో ఎక్కువ మంది చక్కెర పొంగలి ప్రిపేర్ చేస్తుంటారు. దీనిని వివిధ రకాలుగా తయారు చేస్తారు. మరి మీరెప్పుడైనా అటుకల చక్కెర పొంగలి తిన్నారా లేదంటే మాత్రం ఓసారి ఈ విధంగా చేస్తే చాలా అద్దిరిపోతుంది. మొదటిసారు చేసేవారైనా ఈ స్టెప్స్ పాటిస్తే పర్ఫెక్ట్‌గా వస్తుంది. మరి ఆలస్యం చేయకుండా ఈ స్వీట్ రెసిపీని ఎలా చేయాలి? ఇందుకు కావాల్సిన పదార్థాలేంటో ఇప్పుడు చూద్దాం.



**కావాల్సిన పదార్థాలు :**

మందపాటి అటుకులు – 2 కప్పులు (500 గ్రాములు)
పెసరపప్పు – అర కప్పు
పచ్చికొబ్బరి ముక్కలు – అర కప్పు
బెల్లం తురుము – 2 కప్పులు
యాలకుల పొడి – 2 టీ స్పూన్లు
జీడిపప్పు పలుకులు – 20
కిస్మిస్ – 20
బెల్లం తురుము – 2 కప్పులు
పచ్చకర్పూరం – రెండు చిటికెడ్లు
నెయ్యి – సరిపడా



**తయారీ విధానం :**

ఈ రెసిపీ కోసం ముందుగా స్టవ్ ఆన్ చేసి గిన్నెలో అర కప్పు పెసరపప్పు వేయాలి. ఇప్పుడు మంటను లో ఫ్లేమ్‌లో ఉంచి పెసరపప్పును దోరగా వేయించి ఓ ప్లేట్‌లోకి తీసుకొని పూర్తిగా చల్లారనివ్వాలి.అదేవిధంగా ఓ గిన్నెలో రెండు కప్పుల మందపాటి అటుకులు వేసి రెండు సార్లు శుభ్రంగా కడగాలి. అనంతరం అటుకులను గట్టిగా పిండి ప్లేట్‌లో వేయాలి.అనంతరం స్టవ్ ఆన్ చేసి కుక్కర్‌లో వేయించిన పెసరపప్పు, సరిపడా నీళ్లు పోసి మూతపెట్టాలి. ఇప్పుడు మంటను మీడియం ఫ్లేమ్‌లో ఉంచి రెండు విజిల్స్ వచ్చేవరకు ఉడికించి స్టవ్ ఆఫ్ చేసుకోవాలి.మరోవైపు స్టవ్ ఆన్ చేసి పాన్?లో తగినంత నెయ్యి పోయాలి. నెయ్యి కరిగిన తర్వాత అర కప్పు పచ్చికొబ్బరి ముక్కలు వేసి వేయించాలి. పచ్చికొబ్బరి ముక్కలు వేగిన తర్వాత 20 జీడిపప్పు పలుకులు యాడ్ చేసి వేగనివ్వాలి. అనంతరం 20 కిస్మిస్ వేసి ఫ్రై చేసి ఓ ప్లేట్‌లోకి తీసుకోవాలి.ఇదే పాన్‌లో రెండు కప్పుల బెల్లం తురుము, మూడు కప్పుల నీళ్లు పోయాలి. బెల్లం కరిగి మరుగుతున్నప్పుడు అటుకులు వేసి కలిపి ఐదు నిమిషాల పాటు ఉడికించాలి.ఐదు నిమిషాల అనంతరం ఉడికించిన పెసరపప్పు యాడ్ చేసి మిక్స్ చేయాలి. ఆ తర్వాత రెండు టీ స్పూన్ల యాలకుల పొడి, రెండు చిటికెడ్ల పచ్చకర్పూరం వేసి మరో నాలుగు నిమిషాల పాటు ఉడకనివ్వాలి.నాలుగు నిమిషాల తర్వాత వేయించిన పచ్చికొబ్బరిజీడిపప్పు మిశ్రమం, కొద్దిగా నెయ్యి వేసి మిక్స్ చేయాలి. అనంతరం మంటను లో ఫ్లేమ్‌లో ఉంచి మరో ఐదు నిమిషాల పాటు ఉడికించి స్టవ్ ఆఫ్ చేయాలి.అంతే ఎంతో రుచికరంగా ఉండే అటుకుల చక్కెర పొంగలి మీ ముందుంటుంది!మీరు ఈ పొంగలిని ఎక్కువ మోతాదులో చేసుకోవాలనుకుంటే అటుకులు,పెసరపప్పుతో పాటు ఇతర పదార్థాలను అందుకనుగుణంగా పెంచి తీసుకోవాలి.







Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.